GIRDHARI, RNI Regn.No.TELTEL/2021/80612, Date of Pub - 25th of every month
Date posting - 1st of every month at BPC-IV, Patrika Channel, HYD - 01
Postal Regn.No.HQ/SD/525/2024-2026; Licensed to Post without prepayment
WPP No.PMG/TS/HQR/SC-04/WPP/2024-2026








Edited, printed, published and owned by Swami Sundara Chaitanyananda, Printed at M/s Karshak Print Solutions Pvt. Ltd., Moula Ali, Hyd - 500 040.

IF UNDELIVERED PLEASE RETURN TO :
SUNDARA CHAITANYA ASHRAM
HYDERABAD - 500 043


గిరిధారి

మే 2026

శాశ్వత చందా రూ.1200/-
10 సం॥లకు



చైతన్య గీతోపన్యాసములు



శ్రుతిమందిరంలో భక్తియోగం పై
పూజ్య గురుదేవుల ప్రవచనములు

Received Amount : 1450
Balance Amount : 0

యజ్ఞ పోషకులు


శ్రీమతి డి.సురేఖ
అమెరికా, రూ.1,00,000/-
లక్ష రూపాయలు


శ్రీమతి బి.కామాక్షి
అమెరికా, రూ.1,00,000/-
లక్ష రూపాయలు


కుమారి సి.హెచ్.గోపిక
వైజాగ్, రూ.1,00,000/-
లక్ష రూపాయలు


కుమారి డి.హవిష
హైదరాబాద్, రూ.50,000/-
యాభై వేలు


శ్రీ సి.హెచ్.కృష్ణారావు
గుంటూరు
రూ.1,00,000/- లక్ష రూపాయలు


శ్రీరాం రాజేశ్వరి
కరీంనగర్
రూ.50,000/- యాభై వేలు


శ్రీమతి పి.హరిప్రియ, శ్రీ పి.హనుమాండ్లు
హైదరాబాద్, రూ.50,000/-
యాభై వేలు

మహారాజ పోషకులు


శ్రీమతి కె.వి.పద్మ
హైదరాబాద్
రూ.30,000/-



శ్రీమతి కె.సౌమ్య, శ్రీ కె.ఆనంద్
హైదరాబాద్
రూ.30,000/-


శ్రీమతి ఎమ్.కనకశీల
అమెరికా
రూ.25,000/-


శ్రీమతి ఇ.లీలావతి
రాజమండ్రి
రూ.25,000/-



డా॥ శ్రీ సి.హెచ్. బీరప్ప
హైదరాబాద్
రూ.25,000/-


శ్రీ శ్రీరాం నరసయ్య
కరీంనగర్
రూ.25,000/-


మోక్షధామం
హైదరాబాద్
రూ.25,000/-


శ్రీమతి బి.సరస్వతి
శ్రీ బి.కమలయ్య
హైదరాబాద్
రూ.25,000/-


ప్రార్థన





ఓం ద్యౌః శాన్తి! రన్తరిక్షం శాంతిః!
పృథివీ శాంతిః! రాపః శాంతిః!
ఓషధయః శాంతిః! వనస్పతయః శాంతిః!
విశ్వేదేవాః శాంతిః! బ్రహ్మశాంతిః!
సర్వశాంతిః! శాంతిరేవ శాంతిః!
సామాశాంతిరేధి!
ఓం శాంతిః శాంతిః శాంతిః

ద్యులోకము నుండి శాంతి లభించు గాక! అంతరిక్షము నుండి, భూమి నుండి, నీటి నుండి, ఓషధుల నుండి, వృక్షముల నుండి, విశ్వదేవతల నుండి, బ్రహ్మ జ్ఞానము నుండి, సమస్తము నుండి శాంతియే, శాంతి మాత్రమే లభించు గాక! అట్టి శాంతి నాకు ప్రాప్తించు గాక!



ఆధ్యాత్మిక మాసపత్రిక

సంపుటి : 41 సంచిక : 6

వ్యవస్థాపకులు :
శ్రీ స్వామి సుందర చైతన్యానంద

ఇందులో

సంపాదకులు : శ్రీ స్వామి సుందర చైతన్యానంద


జీవిత సభ్యత్వం - రూ. 1200 /-
(10 సంవత్సరములు)

డి.టి.పి. & కవర్ డిజైన్
సుందర చైతన్యాశ్రమం, హైదరాబాద్

ప్రింటింగు : బైండింగు
కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్, హైదరాబాద్

వివరములకు : సుందర చైతన్యాశ్రమం,
దుండిగల్ రోడ్, హైదరాబాద్ - 500 043. ఫోన్:(08418)255777, 9100908777

Visit us at : www.sundarachaitanyam.com (email : admin@sundarachaitanyam.org)



ఆప్తవాక్యం

పలుకురాయి

మనస్సులో మెదిలే మంజుల భావాలను మాటలలో సూటిగా, స్పష్టంగా, మనోహరంగా చెప్పగలిగితేనే ప్రసంగం పసందుగా, వీనులకు విందుగా సాగుతుంది.


అరువు తెచ్చుకున్నవి కరవు తీర్చవు. మనస్సులో ఊట ఉండాలి. నోటిలో మాట నిండాలి. అప్పుడే ప్రసంగంలో పస ఉంటుంది. ప్రవచనం పసందుగా ఉంటుంది.

'అయిందా నీ ప్రసంగం? చాల్లే ఇక ఆపు' అని రుచి లేని మాటలు పలికేవారి ప్రవాహానికి కొందరు అడ్డుకట్ట వేస్తూ ఉంటారు.

అప్పటికీ ఆగకుండా వాగే వారిని... 'ఈ మనిషి ఇంతే, అధికప్రసంగి' అని అడగక పోయినా కొందరికి బిరుదుల్ని పడేస్తూ ఉంటారు.

కొందరు వేదికలపై ప్రసంగిస్తూ ఉంటే,
'ఆఁ ఏదోలెండి. పసలేని ప్రసంగం' అంటూ కొందరు నాలుక చప్పరిస్తూ ఉంటారు.

కొందరి ప్రసంగం మాత్రమే పసందుగా ఉండి వీనులకు విందు చేయడమే గాక హృదయాలను చలింప చేస్తూ ఉంటుంది.



'నన్ను చెప్పవా - నన్ను చెప్పవా'
అని భావాలు వెంటబడుతూ ఉంటే,

నేను చెబుతా - నేను చెబుతానంటూ
పదాలు వెంబడిస్తూ ఉంటే - ఈ రెండిటిని
అనుసంధానం చేస్తూ పలికేది పసందైన ప్రసంగం.

కొందరు తీయగా మాట్లాడుతారు.
వారి మాటలు జనరంజకంగా ఉంటాయి.

కొందరు చక్కగా వ్రాస్తారు.
వారి రచనలు పఠితుల్ని సమ్మోహింప చేస్తాయి.

కొందరు మాట్లాడుతారు. వ్రాయలేరు.
కొందరు వ్రాస్తారు. మాట్లాడలేరు.

అలా గాకుండా,
కొందరు మాట్లాడినట్లే వ్రాయగలరు. వ్రాసినట్లే మాట్లాడగలరు. ఇలాంటివి గొప్పతనాలు కావు; కర్మఫలాలు.


'స్వామిజీ! మీ రచనలు చదువుతూ ఉంటే మాకు చదువుతూ ఉన్నట్లు అనిపించదు. మీ ముందు కూర్చొని వింటున్నట్లే ఉంటుంది. మీరు వ్రాసినా, మాట్లాడినా ఒకే విధంగా ఉంటుంది' అని ఎంతో మంది చాలా కాలంగా నాతో అంటూ ఉంటారు. నిజమే.

అసహనాన్ని ప్రదర్శించడానికి వారు చెప్పింది అసహజమేమి కాదు. పైగా, వాస్తవం కూడా.

కాని, ఒక్క విషయం.
రచనకి, ప్రసంగానికి నా మట్టుకు నాకు ఒక్క తేడా స్పష్టంగా కనిపిస్తూ ఉంటుంది. చెప్పాలనుకొన్న విషయాన్ని సూటిగా చెప్పడం రచనలో జరుగుతుంది. కాని, ప్రసంగంలో అలా కాదు. చెప్పేటప్పుడు శ్రోతల మనోభావాలను ముఖ కదలికలలో చదివి, అవసర మనిపిస్తే విశ్లేషణాత్మకంగా వివరించడం జరుగుతుంది. అలా చూచినపుడు పఠనం కన్నా శ్రవణం చాలా ప్రయోజనం అని చెప్పొచ్చు. సంప్రదాయాన్ని బట్టి చూచినా మనది శ్రవణ పరంపర. విశిష్టమైన శ్రవణ సౌభాగ్యాన్ని పఠన సౌలభ్యంగా మలచడం ప్రయోగం అనే మాటను అలా ప్రక్కన బెడితే, ప్రయోజనం విశేష మనడంలో అతిశయోక్తి లేదు.

సర్వేజనాః సుఖినో భవన్తు!

ॐ స్వామి సుందర చైతన్యానంద



సుందర చైతన్యాశ్రమం

పాడినా నీ పాటలే

పాట (చైతన్య గానం - 3)

శ్రీమతి సి.పద్మ



పల్లవి :
పాడినా నీ పాటలే
మాటాడినా నీ మాటలే ॥ పాడినా ॥

అనుపల్లవి :
ఎన్ని జన్మల పుణ్యఫలమో
యెద నిండా నీ తలపులే ॥ పాడినా ॥

చరణములు :

1. చూడాలని నా కనులు - నిను
చూపాలని కనుపాపలు
అసువులు బాసే వేళలోగా
నీ రూపే చూపు కావాలని ॥ పాడినా ॥

2. నేలపై మనసు నేను
నింగిలో మహిమ నీవు
భాను దున్నది గగన మైనా
పేదకమలము నోచుకోదా ॥ పాడినా ॥


3. నేను నీవను భేదమేల
నీవు నాలో నిలిచిన వేళ
దారి బత్తెము నామము
మోక్ష పదమే గమ్యము ॥ పాడినా ॥

4. చెదిరిపోయిన చిత్తములో
శాంతి నింపును నీ భావము
దాసహృదయ చైతన్యము
వాసుదేవుని నిలయము ॥ పాడినా ॥

అమ్మ గర్భంలో రూపు దిద్దుకొని, అమ్మ ఒడిలో పెరిగి, అమ్మ బడిలో మాటలు నేర్చిన బిడ్డ ముద్దు ముద్దుగా, మొట్ట మొదటగా పలికే పలుకు, పిలిచే పిలుపు, 'అమ్మా!'. అ, ఉ, మ అనే ఓంకార నాదానికి ప్రతిరూపమా అనిపించే 'అమ్మ' అనే శబ్దం సృష్టిలోనే అతి పవిత్రమైంది, అన్ని పిలుపులలోకి అపురూపమైంది.

భక్తుడు బిడ్డ లాంటి వాడు. ప్రపంచంలో ఎన్నిటి మధ్య చరిస్తూ ఉండినా, ఎందరితో సంబంధ బాంధవ్యాలు కలిగి ఉండినా పరమాత్మతో తనకు గల నిత్య సంబంధాన్ని మరువని వాడే నిజ భక్తుడు. ప్రారబ్దవశాత్తు భగవంతుడి ఒడిని వీడవలసి వచ్చినా 'అమ్మా! అమ్మా!'

అంటూ బిడ్డ తల్లినే పిలిచినట్లు భక్తుడు భగవన్నామాన్నే ఉచ్చరిస్తాడు, భగవద్వైభవాన్నే ఆలపిస్తాడు. అందుకే,



పాడినా నీ పాటలే, మాటాడినా నీ మాటలే

అంటూ ఏ గూటి చిలుకకు ఆ గూటి పలుకే నని ఈ పాట ద్వారా మనకు నిరూపిస్తున్నారు మన పూజ్య స్వామీజీ. మరపించేందుకు ఎన్ని బొమ్మలున్నా, ఎత్తుకొని ఎందరు ముద్దాడినా బిడ్డ రోదించేది తల్లి కొరకే. కారణం, తనకు ఆధారమైన తల్లికి బిడ్డ దూరం కాలేకపోవడమే. అలాగే, కర్మజన్యమైన దేహంలో వసిస్తూ, కర్మఫలాలను అనుభవిస్తూ భక్తుడు భగవంతుని చేరేందుకు పరితపిస్తాడే కాని కర్మవలయంలో కూరుకు పోడు. అందుకే,

ఎన్ని జన్మల పుణ్య ఫలమో యెదనిండా నీ తలపులే

అంటూ భక్తుడి లోని విరహ తాపానికి, భక్తుడు సాగించే తపో జీవనానికి పరమాత్మ ధ్యానమే ఫలము, గమ్యము అంటున్నారు పూజ్య స్వామీజీ.

చూడాలని నా కనులు, నిను చూపాలని కనుపాపలు

విగ్రహం లోని వైభవం సామాన్యుల దృష్టికి అందకపోవచ్చు. కానీ, ఒక మహాత్ముడి కనుపాపలలో దోబూచులాడే భగవద్రూపాన్ని కానరాని హృదయముండదు. మహాత్ముల పునర్దర్శన ప్రాప్తికి లోకులు ఆరాట పడేది ఇందుకే. గోవిందుడి కన్నా మిన్నగా గురువును ఆరాధించుటలోని రహస్యమిదే. గురుదేవుడి ఆరాధనలో దాగి ఉండేది గోవిందుడి ఆరాధనే. గురుగోవిందుల అభేద దర్శనమే గురుభక్తి యొక్క ఫలం.

కొండ అద్దమందు కొంచెమై ఉండినా, కొండకు అద్దం పడితే, అద్దంలో కనిపించేది మాత్రం కొండే. మరొకటి కాదు. అద్దంలో ప్రతిబింబం లాగా, కొండలలో ప్రతిధ్వని లాగా మనసు దేనిని గ్రహిస్తుందో దానినే ప్రతిఫలిస్తుంది. సర్వేంద్రియాల ద్వారా వ్యక్త మయ్యేది మనసే కనుక భక్తుడికి బాహ్యాభ్యంతరాలలో కనిపించేది, వినిపించేది, అనిపించేది భగవంతుడే. భక్తుడికి ప్రపంచం భగవన్మయం. అందుకే,

అసువులు బాసే వేళలోగా నీ రూపే చూపు కావాలని

అంటూ, వారు చూసేది, మనకు చూపేది అనంతుడైన భగవంతుడినే అంటున్నారు పూజ్య స్వామీజీ.

ప్రాపంచికమైన వాసనలతో నిండి అరిషడ్వర్గాల మధ్య నలిగేవాడు శిష్యుడు. కడతేర్చ మంటూ ఎలుగెత్తి పిలిచేవాడే కాని చేయూత నిస్తున్న గురుదేవుని హస్తకమలాన్ని అందుకో

లేని బలహీనుడు. శిష్యు లందరూ ఇంతే, గురువెప్పుడూ అంతే. పదే పదే చేజారిపోతూ ఉండినా మరల మరల శిష్యుని చేజిక్కించుకొనువాడే గురువు. 'నింగికి నేలకు సామ్యమా? జ్ఞానికి మూఢుడికి సాపత్యమా?' అంటూ వాపోనవసరం లేదు. గురువు అవతరించేదే మనబోటి వారిని తరింపజేసేందుకు. సరోవరంలో అనేకమైన తీగల నడుమ చిక్కుకొని ఉన్నా, నిశ్చలంగా నింగినే చూస్తూ, అరుణ కిరణ తాకిడికై వేచియున్న కమలాన్ని, దివ్యశోభలతో సూర్యుడు వికసింప చేసినట్లు అర్హత కలిగిన శిష్యుల హృదయాలను జ్ఞానతేజంతో గురుభాస్కరుడు ప్రకాశింప చేస్తాడు. అందుకే,

నేలపై మనసు నేను నింగిలో మహిమ నీవు
భానుడున్నది గగనమైనా పేద కమలము నోచుకోదా

అంటూ, భగవంతుడికి భక్తుడికి, గురువుకి శిష్యుడికి మధ్య ఉండే సామీప్యం, సామరస్యం, సాన్నిహిత్యం భావం లోనే కానీ బాహ్యంలో కాదు అంటున్నారు పూజ్య స్వామీజీ.

నేను నీవను భేదమేల, నీవు నాలో నిలిచిన వేళ

చంద్రునికి వెన్నెలకు, సముద్రానికి కెరటానికి, పువ్వుకు పరిమళానికి గల అవినాభావ సంబంధమే భగవంతుడికి భక్తుడికి గల అనుబంధం. పుట్టిన బిడ్డ క్రమేపి ఎదిగి, వ్యక్తిత్వాన్ని సంతరించుకొని, సర్వ విధాలా స్వతంత్రుడైన నాడు తల్లిని వీడిపోవచ్చు. కానీ, పరాభక్తుడు మాత్రం అన్ని దశలలోనూ అస్వతంత్రుడే. భక్తుడు అస్వతంత్రుడు అంటే పరతంత్రుడని భావం కాదు. అతడు స్వపర భేదాలు లేనివాడు అని భావం. తనంటూ మిగలక, తనకంటూ ఏమీ మిగుల్చుకోక పరమాత్మ భావనలో కర్పూరంలా కరిగిపోయేవాడే భక్తుడు.

చెదిరిపోయిన చిత్తములో శాంతి నింపును నీ భావము
దాస హృదయ చైతన్యము వాసుదేవుని నిలయము

పూవులో సుగంధం లాగా, తేనెలో తీపిలాగా పూజ్య స్వామీజీ హృదయంలో ఉన్నదంతా జ్ఞాన సౌరభమే, భక్తి మాధుర్యమే. భక్తి జ్ఞాన సంగమమైన పూజ్య స్వామీజీ హృదయం వాసుదేవ నిలయం. ఆలయంలో ప్రతిష్ఠితమై ఉండేది భగవన్మూర్తి. ఆలయం నుండి వినిపించేది భగవత్ స్తుతి. కొండపై నున్న దేవుని అందరూ కొండెక్కి దర్శించ లేరు. కానీ కొండ క్రింది నుంచి కూడా హారతి గంటను వినగలరు. పరమ భాగవతోత్తములు పూజ్య గురుదేవులు పలికిన ప్రతి మాటలో, పాడిన ప్రతి పాటలో, రాసిన ప్రతి పదములో పరమాత్మ వైభవాన్నే ప్రకటితం చేశారు, చేస్తున్నారు. పూజ్య స్వామీజీ కలం నుండి, గళం నుండి, అవిరళంగా స్రవించిన భక్తి జ్ఞానామృత ధారలు చెదిరిన చిత్తాలను శాంతితో నింపగలవు అనేది అతిశయోక్తి కాదు, అందరి అనుభూతి.

జై జై గురుదేవ!

శ్రీ ఆదిశంకరాచార్య స్వామి కృతం

దక్షిణామూర్తి స్తోత్రం

ధారావాహిని-2

వ్యాఖ్య
శ్రీ స్వామీజీ

1వ శ్లోకము

విశ్వం దర్పణ దృశ్యమాన నగరీ తుల్యం నిజాంతర్గతం
పశ్య న్నాత్మని మాయయా బహిరి వోద్భూతం యథా నిద్రయా ।
య స్సాక్షా త్కురుతే ప్రబోధ సమయే స్వాత్మాన మే వాద్వయం
తస్మై శ్రీ గురుమూర్తయే నమ ఇదం శ్రీ దక్షిణామూర్తయే ॥

యః	= ఎవడు	పశ్యన్	= చూచుచూ
దర్పణ	= అద్దము నందు	ప్రబోధ సమయే	=జ్ఞానము కలిగిన సమయాన
దృశ్యమాన	= అగుపించు	అద్వయం	= రెండు కాని
నగరీ	= పట్టణమునకు	స్వాత్మానం	= ఆత్మను
తుల్యం	= సరిపడు	ఆత్మని ఏవ	= తన యందే
నిజాంతర్గతం	= తనలోనే ఉన్న	సాక్షాత్కురుతే	= సాక్షాత్కారము చేసుకొనునో
విశ్వం	= ప్రపంచమును	తస్మై	= అట్టి
నిద్రయా	= స్వప్నముచే	శ్రీ గురుమూర్తయే	= శ్రీ గురుస్వరూపుడైన
యథా	= ఎలాగో	శ్రీదక్షిణామూర్తయే	=శ్రీదక్షిణామూర్తికి
మాయయా	= మాయ చేత	ఇదం	= ఈ
బహిః	= బాహ్యమున	నమః	= నమస్కారము.

ఉద్భూతం ఇవ = ఉన్నదాని వలె

భావము

అద్దము నందు ప్రతిబింబించు పట్టణము వలె, తన లోనే ఉన్న ప్రపంచమును, కల లోని ప్రపంచమును చూచినట్లు, మాయ చేత ఎవడు తనకు బాహ్యంలో ఉన్నట్లు చూచుచున్నాడో, అతడే జ్ఞానోదయమైన తరువాత అద్వయమైన ఆత్మ తత్త్వమును తన యందే సాక్షాత్కరించు కొనుచున్నాడో, అట్టి గురుమూర్తి యగు దక్షిణామూర్తికి నమస్కారము.

వ్యాఖ్య

ఏదైనా ఉంది అంటే అది ఉన్నట్లు తెలిసి నపుడే అది ఉందని అర్థము. అస్తి అంటే ఉండుట. భాతి అంటే తెలియుట. నేను ఉన్నాను ***(అహమస్మి).*** ప్రపంచమూ ఉంది ***(జగతః అస్తి).*** జగత్తు తెలియబడుతూ ఉంది. కనుక అది విషయము లేదా దృశ్యము. దానిని నేను తెలుసు కుంటున్నాను. కనుక, నేను విషయి లేదా ద్రష్ట. తెలియబడే విషయప్రపంచం లాంటిదే నా దేహం కూడా. కనుక, విషయి నైన నాకు దేహము కూడా విషయమే. నేను ఎట్టి పరిస్థితుల లోను విషయినే గాని విషయమును గాను. ఇంతకీ దృగ్దృశ్యములలో ఏది సత్యము? అస్తి ప్రకాశముల అర్థం ఎందులో ఉంది?

అస్తి ప్రకాశత ఇతి వ్యవహారః ప్రవర్తతే,

తచ్చ అస్తిత్వం ప్రకాశత్వం కస్మిన్నర్థే ప్రతిష్ఠితమ్ ॥

ఉండుట, ప్రకాశించుట అనేది అంతటా తెలుస్తూనే ఉంది. ఈ ఉండుట, అలా ఉన్నట్లు తెలియుట దేనిని ఆశ్రయించుకొని ఉంది? అని మానసోల్లాసము ప్రశ్నించింది. అంటే, విషయినైన నాలో ఉందా? విషయమైన ప్రపంచంలో ఉందా? ఒక్క మాటలో సూటిగా చెప్పాలంటే, నేను ప్రపంచంలో ఉన్నానా? లేక ప్రపంచం నాలో ఉందా? ఏది సత్యం?

ప్రపంచం ఉన్నట్లు ప్రపంచం చెప్పడం లేదు. నేను చెబుతున్నాను. కనుక నేనే సత్యము. రెండు సత్యాలు ఎప్పుడూ ఉండవు. ఉండలేవు. సత్యము ఒక్కటే అయితే, రెండవది ఉన్నట్లు గోచరిస్తే, అది ఉన్న ఒక్క దాని లోనే ఉండాలి.

అలాగే ఉంది ఈ దృశ్యమాన ప్రపంచము. ఒక నగరం వెలుపల ఒక పెద్ద అద్దము నుంచితే, ఆ అద్దములో పట్టణం తెలుస్తూ ఉంటుంది. అంతమాత్రాన ఆ పట్టణము దర్పణములో ఉన్నట్లేనా? కానే కాదు. ఉన్నట్లు అగుపిస్తూ ఉంది. అంతే. నగరం ప్రతిబింబించడం వలన అద్దము యొక్క స్వచ్ఛతకు, ఏకత్వానికి భంగం వాటిల్లదు. కనిపించే ప్రతిబింబము మిథ్య. దర్పణమే సత్యము. మిథ్యా విషయము గోచరిస్తున్నప్పుడు కూడా అద్దము నిర్మలం గానే ఉంది. అలాగే, ఈ ప్రపంచము నా లోనే అద్దములో కనిపించే నగరంలా ఉంది. ఇక్కడ లోకమంటే కేవలం మానవ లోకమే కాదు. బాహ్యంలో ఉన్నట్లు కనిపించే లోకాలన్నీ అని అర్థం. ***అంతరస్మిన్ ఇమే లోకాః అంతర్విశ్వ మిదం జగత్.***

మరి, ప్రపంచం మనలో అంతర్గత మైనపుడు, మన కన్నా అన్యంగా బాహ్యంలో ఉన్నట్లు ఎలా గోచరిస్తోంది? మాయ చేత అలా కనిపిస్తుంది. అదెలా సాధ్యం? సాధ్యము కానిది సాధ్యమైనట్లు, సత్యము కానిది సత్యమైనట్లు గోచరింప చేసేదే మాయ అంటే. అదెలా? ***యథా నిద్రయా.***

ఇంక కాస్త స్పష్టంగా అర్థం చేసుకుంటాం. మనం కలగంటున్నాం. కల ఎక్కడ జరుగుతూ ఉంది? మన లోనే జరుగుతూ ఉంది. కలలో మన లోనే జరుగుతున్నా, మన

కన్నా వేరుగా, బాహ్యంలో జరుగుతున్నట్లు మనం చూడటం లేదా? అలాగే ప్రపంచం మన లోనే ఉన్నా, మన కన్నా అన్యంగా లేకపోయినా, మాయా ప్రభావం చేత స్వప్నం లాగా మన కన్నా వేరుగా ఉన్నట్లు తెలుస్తూ ఉంది. *మాయయా బహిర్వత్ భాతి!. యథా స్వప్న ప్రపంచోయం మయి మాయా విజృంభితః. ఏవం జాగ్రత్ప్రపంచశ్చ మయి మాయా విజృంభితః -* ఎలాగైతే స్వప్న ప్రపంచం మాయ చేత నాలో స్ఫురిస్తూ ఉందో, అలాగే జాగ్రత్ప్రపంచం కూడా మాయ చేత నాలో కల్పించ బడింది అని వ్యాసవచనము.

మరి, ఉన్నది మనమే నని, మన కన్నా అన్యంగా బాహ్యంలో ఉన్నట్లు గోచరించే ప్రపంచం వాస్తవానికి మన లోనే ఉన్నదని ఎప్పుడు తెలుస్తుంది? *ప్రబోధ సమయే.* జ్ఞానం కలిగినప్పుడే తెలుస్తుంది. కల సత్యం కాదని, కల బాహ్యంలో లేదని ఎప్పుడు తెలుస్తుంది? మేలుకున్నప్పుడే తెలుస్తుంది.

సత్యమైన నీవు నీకు తెలియని నిద్రావస్థలో సత్యం గాని స్వప్నమును సత్యమైనట్లు దర్శిస్తున్నావు. అలాగే అస్తి భాతి ప్రియ రూపమైన నీవు నీకు అర్థం కానంత వరకు అసత్యమైన జగత్తు సత్యంగా భాసిస్తూ, ద్వైత భ్రాంతిని కల్పిస్తూ ఉంటుంది.

యావత్ ఆత్మా న జ్ఞాయతే, తావత్ జగత్ సత్యం భాతి!

సత్యం కానిది సత్యంగా ఎందుకు తెలుస్తూ ఉంది అంటావా, ఏముంది? సత్యమైనది సత్యంగా తెలియక పోవటం చేత. స్వప్నంలో మనం నిర్వహించిన వ్యవహారము, అనుభవించిన సుఖదుఃఖాలు మేలుకోగానే అదృశ్యమైనట్లు, అలాగే గురు ప్రబోధములో జ్ఞానోదయం కాగానే, మనలో ఏ మార్పు లేకనే, మాయా కారణంగా ద్వైత ప్రపంచం గోచరించినట్లు అర్థ మవుతుంది.

కనుక అస్తి, ప్రకాశత - ఉన్నది, ఉన్నట్లు తెలుస్తూ ఉన్నది నీవే. నీవే సత్యము. ఉన్నది నీవే అయినపుడు, ఏది ఉన్నా నీ లోనే ఉండాలి. నీ కన్నా అన్యంగా ఉండే అవకాశము లేదు. ఇల అయినా, కల అయినా, రెండూ ఉన్నా, రెండూ లేకపోయినా, సత్యంగా ఉన్నది మాత్రం నీవే. ఇదే ఆత్మ స్వరూపము. ఆది గురువులైన దక్షిణామూర్తి ప్రబోధము. అట్టి దక్షిణామూర్తి గురుదేవునికి నమస్కారము.

మరి ఉన్నది నీవే అయినపుడు ఈ సృష్టి ఎలా వచ్చింది? రాక ముందు ఎక్కడుంది? వాస్తవానికి వచ్చిందా? ఈ విషయాన్ని రెండవ శ్లోకంలో చర్చించు కుందాం.


(సశేషం)


శ్రీకృష్ణ కథాగానం

ధారావాహిని-6

స్వామి సుందర చైతన్యానంద


(96) మల్లుల జంపిన ఆనందములో
వాద్యములను మ్రోగించిరి గోపులు
అందెల రవళితో సందడి చేసిరి
నృత్యము చేసిరి రామకృష్ణులు ॥ వినవే ॥






(97) ధృతి చెడి మతి చెడి కుమిలిన కంసుడు
వారించి వాద్యములు వాయించరాదని
వసుదేవుని వధించమనెను
అది విని లంఘించె వాసుదేవుడు ॥ వి ॥

(98) ఖడ్గము బూని లేచెను కంసుడు
పక్షీంద్రుని వలె అటు ఇటు ఊగెను
కంస గజమును గోపాల సింహము
పట్టి వధించెను వసుధను బ్రోచెను ॥ వి ॥





(99) ఏడ్చిరి కంసుని తమ్ములేడుగురు
కృష్ణునిపై బడిరి సోదరప్రేమతో
అది గని పరిఘను ఎత్తెను రాముడు
చంపెను కంసుని తమ్ములను ॥ వి ॥

(100) మ్రోగెను గగనాన దేవదుందుభులు
చల్లిరి పువ్వులు దేవప్రభువులు
పాడిరి గీతాలు నారదాదులు
చేసిరి నృత్యాలు దేవవనితలు ॥ వి ॥





(101) జననీజనకుల బంధము తొలగించి
వందనమిడిరి బలరామకృష్ణులు
మాతాపితల సేవకు నోచని
మము క్షమింపుడని వేడిరి తనయులు ॥ వి॥




(102) ప్రేమబాష్పాలు పొరలి పారగా
బిడ్డను తడిపిరి జననీజనకులు
మోమును జూచిరి ముద్దులు పెట్టిరి
పలుకులు మాని పరవశించిరి ॥ వినవే ॥




(103) మాతామహుడు కంసుని జనకుడు
ఉగ్రసేనుని ప్రభువుగ జేసి
ప్రజలను ప్రేమతో పాలించమనెను
దయగల ప్రభువుగ జీవించమనెను ॥ వి ॥

(104) అందరు ఆనందముతో నుండగ
నందుని కనులలో నిండెను జలములు
గోవిందుడు లేని గోకుల మెందుకు
అని విలపించెను విలవిల లాడెను ॥ వి ॥





(105) తల్లియు తండ్రియు తెలియని మేము
పెరిగినాము మీ ప్రేమలోనే
నందయశోదల బిడ్డల మని మేము
మరువ మెన్నటికి అనెను కృష్ణుడు ॥ వి ॥



(106) వందనములు మా తల్లి యశోదకు
గోగణ సమేత భక్తజనులకు
వెన్నతో పెరిగిన మీ చిన్నికృష్ణుడు
కఠినుడు కాడు మిమ్ముల మరువడు॥ వి ॥



(107) బాధను గుండెలలో బందీ జేసి
కన్నులలో కన్నీటిని దాచి
యెద భారముతో ఏగెను నందుడు
రెప్పలార్పక చూచెను కృష్ణుడు ॥ వినవే ॥

(108) అవధులు లేనిది కృష్ణుని ప్రేమ
ఆ ప్రేమను మనము పొందలేమా
కృష్ణుని చరితము గుణకీర్తనము
ముదమును గూర్చును మోక్షము నిచ్చును ॥ వి ॥




ఫలశ్రుతి

పలికి రెందరో కృష్ణుని నామము
వీనుల విందుగా కృష్ణ చరితము
చైతన్య శ్రీకృష్ణ కథా గానము
వినినా అనినా బ్రతుకు ధన్యము ॥ వినవే ॥

(సమాప్తం)




సంతాపము



శ్రీమతి కె.కౌసల్యా రెడ్డి
సుందర సత్సంగ్, నెల్లూరు

పూజ్య స్వామీజీ
భువికి దైవ మిచ్చిన అపురూప వరం

డా॥ శ్రీ జె.రమణయ్య
ఎమ్.ఏ; ఎమ్.ఇ.డి; ఎమ్.ఫిల్. (పి.హెచ్.డి.)
మాజీ కార్యదర్శి, సుందర సత్సంగ్, జగిత్యాల





ప్రపంచం లోకి ఎందరో ప్రవేశిస్తారు. ప్రపంచం నుండి ఎందరో నిష్క్రమిస్తారు. కొందరు మాత్రమే తమ ఉన్నత ఆశయాల ద్వారా, అద్భుత కార్యాల ద్వారా చిరస్మరణీయంగా నిలిచి ఉంటారు. అట్టి వారిలో పూజ్య స్వామీజీ అగ్రగణ్యులు. వ్యక్తి వికాసానికి, సమాజ అభ్యుదయానికి తమదైన ఒక వినూత్నమైన, విలక్షణమైన మార్గాన్ని నిర్మించి భావితరాలకు తమ పాదముద్రలనే వెలుగు కిరణాలుగా నిలిపిన మహనీయులు వీరు. మహోవక్తగా, మహోన్నత వ్యక్తిగా ఆధ్యాత్మిక ప్రపంచంలో శ్రీ స్వామీజీ వారి స్థానం సమున్నతం.

పూజ్య స్వామీజీ సనాతనధర్మ దీపికను చేపట్టి మానవాళిని ఆవరించి ఉన్న అజ్ఞాన చీకట్లను పటాపంచలు చేస్తున్నారు. ఆర్ష సంస్కృతి పునర్వైభవ ప్రాప్తికి అంకురార్పణ చేసి మన జాతి గత వైభవాన్ని మనకు గుర్తు చేస్తున్నారు. ప్రతి హృదయంలో ఆధ్యాత్మిక జ్యోతిని వెలిగించి ఆత్మజ్ఞానం పట్ల ఆసక్తిని, జిజ్ఞాసను, ముముక్షుత్వాన్ని మేలుకొలుపు తున్నారు. విద్యావంతులైన యువతలో సంస్కృతి పట్ల అలక్ష్యానికి కారణం వేద విజ్ఞానము నందు వారికి సరైన అవగాహన లేకపోవటమే అని శ్రీ స్వామీజీ అభిప్రాయ పడతారు.

శ్రీ స్వామీజీ వారిది బహుముఖ ప్రజ్ఞ. వారి ప్రతిభ, మేధాశక్తి, బుద్ధి కుశలత అసమానం. వారి గాత్ర మాధుర్యం, వాగ్వైభవం అనితర సాధ్యం. వారి వేదాంత విద్యా ప్రచారం, జన జాగరణ మహోద్యమం న భూతో న భవిష్యతి. వ్యక్తి ఔన్నత్యానికి, సమాజ అభ్యుదయానికి కంకణబద్ధులై మానవ ఆలోచనా విధానాన్ని, జీవన సరళిని సవరించి, సంస్కరించేందుకు పూజ్య స్వామీజీ అహరహం శ్రమిస్తూ ఉంటారు. శ్రీ స్వామివారు తమ అలుపెరుగని గళంతో, విరామ మెరుగని కలంతో భక్తి జ్ఞాన ప్రచారం చేస్తూ పండిత పామరులలో, స్త్రీ పురుష, యువజన బాలబాలికలలో సైతం సాత్త్వికతను, తాత్త్విక అవగాహనను పెంపొదిస్తూ ఉంటారు.

హిందుత్వము, మానవత్వము, సత్యధర్మాలు, నీతినియమాల యొక్క అస్తిత్వమే ప్రశ్నార్థకంగా మారిన ప్రస్తుత కాలంలో పూజ్య స్వామీజీ సశాస్త్రీయంగా, సహేతుకంగా వినిపించే వేదాంత బోధలు జనులను ఎంతగానో ప్రభావితం చేస్తూ, ఉత్తేజపరుస్తూ ఇటు వ్యక్తి జీవితంలో ఒక క్రొత్త మలుపును, అటు సమాజంలో ఒక శుభకర పరిణామాన్ని సాధిస్తూ ముందుకు సాగుతూ ఉండటం మన తెలుగుజాతి చేసుకున్న పూర్వపుణ్య విశేషం. అజ్ఞాన తిమిరాలు అలుముకున్న సమాజంలో శ్రీ స్వామివారి మార్గదర్శకత్వమే ప్రగతికి దారిదీపం.

పూజ్య స్వామీజీ ప్రజ్ఞా పాటవం, శాస్త్ర పరిజ్ఞానం అనన్య సామాన్యం. ప్రాక్ పశ్చిమ తత్త్వశాస్త్రాలలో శ్రీ స్వామీజీ దిట్ట. వారి లోని భాషా ప్రావీణ్యం, సంగీత సాహిత్య కళా నైపుణ్యం, ప్రవచనా వైదుష్యం ఒక దానితో ఒకటి పోటీ పడుతూ ఉండగా, అన్నిటిలో 'వారికి వారే సాటి' అనే మాట వివిధ శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు, కళాకారులు, వేదాంత దురంధరులు ఏకగ్రీవంగా, ఆమోదించి, శ్లాఘించిన సత్యం.

శ్రీ స్వామీజీ రచనా కౌశలం వర్ణనాతీతం. తెలుగు లోను, ఆంగ్లం లోను వారు లిఖించిన వందలాది గ్రంథాలు జిజ్ఞాసువుల బుద్ధికి పదును పెడుతూ ఉంటాయి. వారు రచించి, స్వరపరచి, గానం చేసిన వందలాది చైతన్య గానాలు, భజనలు, స్తోత్రాలు, తత్త్వాలు పండిత పామర జనరంజకంగా సాగి వినేవారి హృదయాలలో చెరగని ముద్ర వేస్తాయి. చైతన్య భగవద్గీత గ్రంథం ప్రతి గృహమును ఆలయంగా మార్చాలని, గుండెగుండెను వేద వాఙ్మయంతో నింపాలనేదే శ్రీ స్వామీజీ వారి ఆశయం.

పూజ్య స్వామీజీ నేటికి **240** జ్ఞానయజ్ఞాలు పలు ప్రాంతాలలో నిర్వహించగా, ప్రతి యజ్ఞస్థలి ఇసుక వేస్తే రాలని వేలాది శ్రోతలతో, ఒక త్రివేణీ సంగమంగా పావనమయింది. ప్రతి జ్ఞానయజ్ఞంలో లక్షలాది మంది ప్రభావితు లయ్యారు. తమ


వాగ్వైభవంతో, మృదుగంభీర గళంతో, మధుర గానంతో అనుభవ సహితమైన బోధనా విషయాలతో శ్రోతలను మంత్రముగ్ధుల్ని చేస్తారు. వేల మంది వింటున్నా సూది మోపిన నిశ్శబ్దంతో మైదానమంతా ఒక నిస్తరంగ జలధి లాగా దర్శన మిస్తుంది.

గీతాజ్ఞానం ఎవరు ఎక్కడ బోధించినా, విషయం ఒక్కటే. కానీ శ్రీ స్వామీజీ సంప్రదాయ బోధను అనుసరించి శ్లోకార్థాలను విప్పి చెప్పే విధానం, అందులో ఉండే స్ఫటికం లాంటి స్వచ్ఛత, సందేహాలకు తావివ్వని విశ్లేషణ జిజ్ఞాసువుల బుద్ధిలో నిశ్చయ జ్ఞానాన్ని నిలపడమే కాకుండా, వారి హృదయాలలో పూర్ణ భక్తిని, వైరాగ్యాన్ని, ముముక్షుత్వాన్ని నింపి సంశయాల తెరలు, పొరలు, తొలగిపోతూ ఉండగా ఇంకా ఇంకా వినాలనే ఉత్సాహాన్ని శ్రోతలలో కలిగిస్తాయి.

మానవుడు గర్వించే ధనము, జనము, యవ్వనము, సౌందర్యము, పాండిత్య ప్రకర్షలు, మేధా సంపత్తులు - సర్వము క్షణికమని, త్రుటిలో మాయమై దుఃఖసాగరంలో పడదోస్తాయని పూజ్య స్వామీజీ కళ్ళకు కట్టినట్లుగా పురాణ ఇతిహాసముల లోని ఘట్టాలతో వివరిస్తూ ఉంటే మనసులు వైరాగ్యంతో నిండి పోతాయి. వెనువెంటనే మనిషి అధిరోహించ వలసిన ఉత్కృష్టమైన పరమపదం మోక్షమని, అందుకు జ్ఞానమే మార్గమని శాస్త్రోక్తంగా నిరూపిస్తూ ఉంటే, హృదయాలు ఆనంద పారవశ్యంలో ఓలలాడుతాయి. ఇది శ్రీ స్వామివారు చివరగా శ్రోతలపై సంధించే బ్రహ్మాస్త్రం. దీని ఫలితంగా, ఆనందానికై ఇక ప్రపంచం వైపు ఎవరూ తిరిగి చూడరు.

*1984*వ సంవత్సరం పూజ్య స్వామీజీ తూర్పు గోదావరి జిల్లా, ధవళేశ్వరంలో తమ ప్రథమ ఆశ్రమాన్ని స్థాపించారు. అందులో నెలకొల్పబడిన శ్రీ మురళీకృష్ణ ఆలయం, రామాలయం మరియు కైలాసనాథ మందిరాల యొక్క శిల్పకళా సౌందర్యం వచ్చిన వారిని ఇట్టే ఆకట్టుకుంటుంది. అప్పటి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ శ్రీ శంకరదయాళ్ శర్మ గారు, పూజ్యశ్రీ రంగనాథానంద స్వామీజీ, కవియోగీంద్రులు శ్రీ శుద్ధానంద భారతి స్వాముల వారు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులు, మరెందరో పండితులు, పుణ్య పురుషులు, వేదవిదులు, సాధువులు ఆశ్రమానికి అతిథులుగా విచ్చేసి అక్కడి ప్రశాంత వాతావరణాన్ని, శిల్ప సౌందర్యాన్ని, వేదాంత సౌరభాన్ని, ఆప్యాయతతో కూడిన ఆతిథ్యాలను, ప్రేమాభిమానాలను మనసారా ప్రశంసించారు. భక్తి జ్ఞాన స్రోతస్విని నిత్యము ప్రవహించే ప్రేమ ధామమే సుందర చైతన్యాశ్రమం. ఈ అద్భుత ఆశ్రమం నుండి శంకర వాఙ్మయాన్ని, శ్రుతిస్మృతి పురాణాలను, ఉపనిషద్విజ్ఞానాన్ని శ్రీ స్వామీజీ విరివిగా భక్తులకు వితరణ చేశారు. ఆశ్రమం అపురూప

శిల్ప ఖండాలతో, బాలకృష్ణుని లీలామాధుర్యాన్ని స్మృతికి తెచ్చే అందమైన విగ్రహాలతో ఎంతో శోభాయమానంగా అలరారుతూ ఉంటుంది. ఏటేటా వార్షికోత్సవాలు, సుందర సత్సంగ సమ్మేళనాలు, సప్తాహాలు, విశ్వశాంతి హోమాలు జరిగే సమయాలలో అసంఖ్యాకంగా తరలి వచ్చే భక్తులకు అక్షయంగా అన్న సంతర్పణ జరిపే ఈ ఆశ్రమం, అభినవ నైమిశారణ్యమే.




ఆశ్రమం నుండి వెలువడే 'గిరిధారి' ఆధ్యాత్మిక మాసపత్రిక పాఠకుల జ్ఞాన పిపాసను తీర్చే అమృత కలశం. ఇరవై రెండు వేలకు పైగా జీవిత సభ్యులను కలిగిన ఈ అసమాన మాసపత్రికలో అధికతరం శ్రీ స్వామి వారి కలం నుండి జాలువారే అద్భుత రచనలే ఉంటాయి. గహనమైన వేదాంత విషయాలను తీయతీయని భావాలతో కలబోసి, లలిత లలిత పదాలలో నింపి సామాన్య జనులకు అందించ గల ప్రతిభ, శైలి శ్రీ స్వామీజీ సొంతం.

పూజ్య స్వామీజీ తమ పూప వయస్సు లోనే భగవంతుని వైపుకు మరలిన విధంగా బాలురను, యువతను దైవోన్ముఖం గావించేందుకు, ఆధ్యాత్మిక దిశగా వారిని ఉత్తేజ పరచేందుకు అనుగుణమైన ప్రణాళికలను నిరంతరం సిద్ధం చేస్తూ ఉంటారు. ఈ విధంగా ఋషి ఋణం తీర్చుకునే మార్గాన్ని వారికి సుగమం చేస్తుంటారు.

శ్రీ స్వామీజీ గీతా జ్ఞానయజ్ఞాలను నిర్వహించిన ప్రతి నగరం లోను, పట్టణాల లోను సుందర సత్సంగాలను నెలకొల్పారు. శ్రీ స్వామీజీ ప్రవచనాలతో ప్రభావితమైన భక్తులంతా ఇందులో సభ్యులై క్రమం తప్పకుండా ప్రతి ఆదివారం సాయంత్రం నిర్ణీత కాలానికి సత్సంగ భవనంలో సమావేశమై, పూజ్య స్వామీజీ వారు రూపొందించిన కార్యక్రమాన్ని తు.చ. తప్పకుండా, అన్ని నిబంధనలను పాటిస్తూ ఎంతో క్రమశిక్షణతో జరుపుకుంటారు. తమ వల్ల ప్రభావితమైన వారందరిలో ఆధ్యాత్మిక స్పృహ నిరంతరం కొనసాగాలని, వారి నిత్య జీవితం నుండి వేదాంతం ఎన్నడూ వేరు కాకూడదు అనేదే ఈ సత్సంగాలను నెలకొల్పడంలో స్వామీజీ ముఖ్యోద్దేశం.

చివరగా, శ్రీ స్వామీజీ దీర్ఘాయుష్షుతో వర్ధిల్లాలని, వారు చేసే ఆధ్యాత్మిక సేవలకు, జన జాగరణోద్యమానికి, సనాతన ధర్మ పునరోద్ధరణ కార్యక్రమాలకు వలయు శక్తి సామర్థ్యాలను వారికి సమృద్ధిగా ప్రసాదించి ఆశీర్వదించ వలసిందిగా భగవంతుని ప్రార్థిస్తూ ఉన్నాను.



శ్రీ శంకరాచార్య స్వామి కృతం

ధన్యాష్టకం

ధారావాహిని-2

వ్యాఖ్య
శ్రీ స్వామీజీ

2వ శ్లోకము

శ్లో॥ ఆదౌ విజిత్య విషయా న్మదమోహ రాగ
ద్వేషాది శత్రుగణ మాహృత యోగరాజ్యాః।
జ్ఞాత్వా మతం సమనుభూయ పరాత్మ విద్యా
కాంతా సుఖం వనగృహే విచరన్తి ధన్యాః॥ 2

ఆదౌ=మొదట, విజిత్య=జయించి, విషయాన్=ఇంద్రియ విషయాలను, మద=మదము, మోహ=మోహము, రాగ ద్వేషాది=రాగద్వేషములు మొదలైన, శతృగణమ్=శత్రు సమూహము, ఆహృత=పొందిన, యోగరాజ్యాః=యోగ రాజ్యమును, జ్ఞాత్వా=జ్ఞానమును పొంది, మతమ్=జ్ఞానమును, సమనుభూయ=ఆస్వాదించి, పరాత్మ విద్యా=ఆత్మవిద్యను, కాంతా సుఖమ్=సతి సుఖమును, వనగృహే=వన మనెడి గృహంలో, విచరన్తి=సంచరించు వారు, ధన్యాః=ధన్యులు.

భావము :- విషయ లోలత్వమును, మద, మోహ రాగద్వేషాది శత్రు సమూహమును ముందే జయించి, యోగ రాజ్యమును పొంది, సత్యదర్శనులై, కానలనే నిలయం చేసుకొని ఆత్మసుఖ మనెడి అర్ధాంగితో ఆనందించు వారు ధన్యులు.

వ్యాఖ్య

అనిత్య భోగాలు

యోగం నచ్చని వారు ఉంటారు గాని, రోగం నచ్చే వారు, భోగం నచ్చని వారు లోకంలో ఉండరు. మెచ్చే భోగాలు వచ్చే రోగాలకు రాస్తాలని తెలిసినా మనుషులు భోగాలను వదలరు.

ఏవి భోగాలు? ఏవి ఎవరికి భోగాలు? అనుభవించే వాడు భోగి అయితే, అనుభవింప బడేవి భోగాలు. ఇంద్రియాలకు ఇష్ట విషయాలతో ఏర్పడే సంబంధమే భోగము. ఇష్ట వస్తువు లభించాలి. తత్సంబంధ మైన ఇంద్రియము ఆరోగ్యం గాను, ఆసక్తి తోను ఉండాలి. విషయాలను ఇంద్రియాల ద్వారా అనుభవించేది మనస్సు కనుక మనస్సు కూడా సిద్ధంగా ఉండాలి. ఇవన్నీ ఎప్పుడో గాని ఒక త్రాటి మీదకి రావు.

ఒకవేళ వచ్చినా ఎంతో కాలం ఉండవు. భోగానికి ఆది ఉంది. కనుక అంతమూ ఉంటుంది. ఇవన్నీ అనిత్యాలు. శ్రమతో సమీపిస్తాయి. సమీపించి శ్రమింప చేస్తాయి. విషాదాన్ని మిగిల్చి నిష్క్రమిస్తాయి. ఏ భోగాలైనా ప్రపంచంలో ఇలాగే ఉంటాయి.

ప్రజలలో ప్రభువు ఎలా గొప్పవాడో, భోగాలలో కూడా రాజభోగాలు గొప్పవి అని అందరి అభిప్రాయం. కారణం, భోగాలు అనుభవించటానికి ప్రతిబంధకాలు తక్కువగా ఉంటాయి. కాని, భోగాలు దుఃఖాలకు కారణాలు అనే సత్యం అర్థమైతే, ఏ భోగాలైనా, ఎవరి భోగాలైనా అవాంఛనీయములే. ఈ వాస్తవాన్ని గ్రహించ లేని అవివేకులు భోగాల యందు రమిస్తూ ఉంటారని, అలాంటి వారు పశు జీవనానికి భిన్నంగా లేరు అని శ్రీశంకరులు గీతా భాష్యంలో చెబుతారు **(అత్యన్త మూఢానాం ఏవ హి విషయేషు రతిః దృశ్యతే, యథా పశు ప్రభృతీనామ్).**

భోగానందం - బ్రహ్మానందం

భోగానుభవమును మనిషి ఎందుకు అభిలషిస్తాడు? సుఖ పడేందుకు. భోగానుభవములో సుఖ మున్నదా? ఆనంద మున్నదా? ఉంది అని అభిప్రాయ పడటం చేతనే ఇష్ట వస్తువుల్ని పొంది తద్వారా సుఖించాలని మనిషి భావిస్తున్నాడు.

సుఖ మనేది ఇష్టవస్తు ప్రాప్తిపై ఆధారపడి ఉందా? ఇష్ట వస్తువు ప్రాప్తించిన వారు సుఖపడలేక పోవటం మనం చూస్తూనే ఉన్నాము. అంతేకాదు; దేనిని ఆశించకుండా, దేని పైన ఆధార పడకుండా సదానంద స్వరూపులుగా శోభించే జ్ఞానులను కూడా చూస్తున్నాం. కనుక, ఆనంద మనేది భోగాలకు సంబంధించింది కాదు. ఆనంద మనేది కేవలం తన స్వరూపం లోనే ఉంది. తానే ఆనందం. ఇదే ఆత్మానందం లేదా బ్రహ్మానందం. ఈ విధమైన ఆత్మ యొక్క జ్ఞానమును పొందిన వాడు జ్ఞాని. నిత్యానంద స్వరూపుడు. ఆ మహాత్మునిది ఆనంద రాజ్యము. దుఃఖము తెలియని రాజ్యము. దీనిని యోగ రాజ్యమని శ్రీ శంకరులు అభివర్ణించారు. అదే జ్ఞానరాజ్యము. జ్ఞానము రాజ్యమేలే ధామం.

శత్రు జయం

శత్రువులను జయించక పోతే రాజ్యము లభించదు. శత్రుశేషము లేకుండా శోభించటమే ప్రభు విశేషము. రాజు ఎలాగైతే శత్రువులను జయించి సింహాసనాన్ని అధిష్ఠిస్తాడో అలాగే ఆత్మజ్ఞాని కూడా ముందుగా **(ఆదౌ)** మదమోహ రాగద్వేషాది శత్రు గణాన్ని జయించి ఆత్మ సింహాస నారూఢుడై శోభిస్తాడు.

మదము :- మదము మనిషికి శత్రువు. మదము కూడా గర్వమే. ప్రతి మనిషిలో ఏదో ఒక విశేషం ఉంటుంది. కొందరికి ధనం, కొందరికి జనం, కొందరికి అందం, కొందరికి పాండిత్యం కాస్త మెరుగ్గా, హెచ్చుగా ఉంటాయి. తమలో చోటు చేసుకున్న ఈ విశేషాలు అన్యులలో లేవని గుర్తించి, గర్వంతో చరిస్తారు. ఇదే మదము. ఈ ఉన్న వన్నీ కాలం ఊడ్చి పారేసేందుకే ఉన్నవని గ్రహించ లేరు. ఈ విధమైన మదము జ్ఞాన ప్రాప్తికి ప్రతిబంధకమైన శత్రువు. దీనిని వివేకులు మొదట జయించాలి.

ఏది మనకున్నా, అది మనది కాదని, మన కొరకు ఉన్నదని, అది కూడా ఎప్పుడూ ఉండదని, ఉన్నంత వరకు పరమాత్మ ప్రసాదంగా ఉన్నదని గ్రహించి ప్రశాంతచిత్తులై జీవించు వివేకవంతులు మదమును జయిస్తారు.

మోహము :- లేని దానిని ఉన్నట్లు చూడటం మోహము. లేని విలువను ఆపాదించటం మోహము. ధనమును ధనంగా చూడవచ్చు. ధనాన్ని సర్వస్వంగా భావించటం మోహము. అవసరాలు తీరటానికి ధనం ఉపకరించ వచ్చు. ధనమే అవసర మని భావించటం మోహము. సుఖం లేని చోట సుఖ ముందని భావించటం మోహము. ఇదంతా అవివేకము. వివేకము ద్వారా మోహమనే శత్రువును జయించాలి.

రాగద్వేషాలు :- రాగద్వేషా లంటే ఏవో కావు, ఇష్టాయిష్టాలే. కనుక వ్యక్తిగతాలు. అందరూ బట్టలు కొంటారు. బట్టల రంగులు భిన్నంగా ఉంటాయి. ఇవే ఇష్టాయిష్టాలు. నీకు దేనిపై రాగముందో, దానిపై నాకు ద్వేషం లేక పోవచ్చు. అలాగని రాగం ఉండాల్సిన అవసరం లేదు.

ఒకే ఇంటిలో ఒకరు ఆడియో క్యాసెట్ వింటూ వుంటే మరొకరు వెళ్ళి దానిని కట్టేస్తారు. ఇవి రాగద్వేషాలు. ఆకలికి అందరికీ ఆహారం అవసరం. అందరూ ఒకే ఆహారాన్ని తీసుకోలేరు. స్నేహాన్ని అందరూ అభిలషిస్తారు. కాని, అందరూ అందరికీ అన్ని వేళల స్నేహితులుగా ఉండలేరు. ఇవన్నీ రాగద్వేషాలే.

పరస్పర భిన్నంగా గోచరించే ఈ రాగద్వేషాలు వ్యక్తుల స్వభావాలు. మనస్తత్వంలో ఒదిగి పోయినవే స్వభావాలు. ఈ రాగద్వేషాలు బుద్ధిని మలిన పరుస్తాయి. జ్ఞానార్జనకు ప్రతిబంధకంగా నిలుస్తాయి. రాగద్వేషాలను ఉన్నపళంగా ప్రక్షాళనం చేయటం అనుకున్నంత సులభం కాదు. అవగాహన లోనే అవి ఆవిరి కావాలి. అందుకే కర్మయోగం. రాగద్వేషాలను లేకుండా చేసుకోలేము. కాని, వాటికి లొంగకుండా మనల్ని మనం రక్షించు కోవాలి. ఈ సత్యాన్ని భగవద్గీత అద్భుతంగా ప్రవచించింది.

ఇంద్రియ స్యేన్ద్రియ స్యార్థే రాగద్వేషౌ వ్యవస్థితౌ
తయో ర్న వశమాగచ్ఛే త్తౌ హ్యస్య పరిపన్థినౌ ॥

ఇంద్రియాలకు వాటికి సంబంధించిన ఇంద్రియ విషయముల యందు రాగద్వేషాలు ఉన్నాయి. ఆ రాగద్వేషాలకు వశం కాకూడదు. జ్ఞానికి రాగద్వేషములు ప్రబల శత్రువులు.

ఆనంద జీవన యాత్ర

రాజ్యాలు ప్రాప్తించ వచ్చు. పారి పోకుండా ఉండలేవు. సుఖాలు సమీపించ వచ్చు.

దూరం కాకపోవు. కాంతలు సుఖాలనే కాదు; చింతలను కూడా ముందు ఉంచేందుకే ఉన్నారు. పారిపోని సుఖాలు, మారిపోని సహచరులు ప్రపంచంలో లభించటం కష్టం. ఎక్కడా లభ్యం కానిది తన లోనే లభించటమే జ్ఞాన విశేషం. వైభవం.

మదమోహ రాగద్వేషాది శత్రువులను జయించి, యోగరాజ్యమును అధిష్ఠించిన ఆత్మజ్ఞానికి అరణ్యమైనా ఆనంద నిలయమే. ఏ విధం గాను అరణ్యం వాసయోగ్యం కాదు. అందుకే పూర్వపు రోజుల్లో అరణ్యవాసం శిక్షా నిలయమైంది. కానల కేగుట అంటే కారాగృహవాసమే అనే అభిప్రాయం ధృవపడింది.

కారాగృహం భయ నిలయం. కానలు కూడా అంతే. రెండూ నిర్జన ప్రదేశాలే. కానలలో మృగాల భయం. కారాగృహంలో మానవమృగాల భయం.

కాని జ్ఞాని పరిస్థితి వేరు. తన సుఖం, తన స్వేచ్ఛ బాహ్య పరిస్థితులపై ఆధారపడి లేదు. ఆత్మ సామ్రాజ్యంలో తాను తిరుగు లేని ప్రభువు. ఎదురు లేని చక్రవర్తి. యెద సింహాసనంపై అసమాన వైభవంతో శోభించే మహారాజు.

సుఖ సతి

చాలా మందికి సతి సుఖ వస్తువు. సతి ఉంటే సుఖ మున్నట్లే అని భావించటమే ఉత్సాహంతో మూడు ముళ్ళు వేయటం వెనుక రహస్యము. అందులో వాస్తవ మేపాటిదో నిర్ణయించా లంటే, మధ్యవర్తిగా నేతి బీరకాయనే ఎంచుకోవాలి.

సతి వల్ల సుఖం వస్తే రావచ్చు. సతియే సుఖం, పతియే సుఖం అని అంటే మాత్రం సన్యాసులకు ఇబ్బంది లేకపోవచ్చు గాని, గృహస్థులు చాలా మంది ప్రతిపక్షంలో చేరుతా రనేది అక్షర సత్యం.

సతి సారె తీసుకొని వస్తుందని విన్నామే గాని సుఖం తీసుకొని వస్తుందని వినలేదు. సుఖం తీసుకొని వచ్చేటట్లయితే, అందరూ ఎంత సుఖం తెచ్చావని అడిగేవారు. అంతేగాని, కట్న మెంత తెచ్చావు? సారె ఏ మాత్రముగ? అని ఎందుకు ప్రశ్నిస్తారు.

సతి సుఖ మని, పతి సుఖమని అందరూ భ్రమిస్తూ ఉంటే, ఆత్మవిదునికి సుఖమే సతిగా సమీపించింది. ఆత్మసుఖమే అర్ధాంగియై ఆనందింప చేస్తూ ఉంది.

'అక్కడి కెప్పుడు తీసుకు పోతావు?' అని అడగదు. దూరభారాలు అర్థం గాని అద్భుత సతి. అనంతవతి. 'అది కావాలి - ఇది కావాలి' అని అర్థించని అర్ధాంగి. ఆత్మవతి. ఆప్తకామవతి. అట్టి ఆత్మసుఖ సతితో ఆనంద జీవన యాత్రను సాగించు ఆత్మవిదులు ధన్యులు. అట్టి జీవనయాత్రలో చేరుటకు ఉద్యమించు ముముక్షువులూ ధన్యులే.

(సశేషం)

కోపంలో పడకు.... నిలబడు-1

స్వామి సుందర చైతన్యానంద



ఆశించి పొందాలనుకున్నది పొంద లేనపుడు మనిషిలో నిరాశ జనిస్తుంది. అట్టి నిరాశకు కారణమైన దానిపై కోపం పుడుతుంది. ఇదొక అసుర లక్షణము. పుట్టిం దంటే విడిచి పెట్టదు. నిప్పు లేకుండానే తగల బెడుతుంది. నీళ్ళు లేకుండానే నిలువున ముంచేస్తుంది.

మనిషి క్రోధం లేకుండా ఉండలేడు. క్రోధాన్ని సంపూర్ణంగా లేకుండా చేసుకోవడం జ్ఞానికి మాత్రమే సాధ్యం. కాని, సాధకుడు కోపం రాకుండా జాగ్రత్త పడగలడు. కోపాన్ని రానివ్వకుండా చూసుకొని, మనస్సు లోని ప్రశాంతతను భగ్నం కాకుండా చూసుకో గలడు.

కోపము ముందు వెనుకలు చూడదు. పెద్ద చిన్న అని ఆలోచించదు. ఏ భాష మాట్లాడుతుందో అర్థం కాదు. పట్టు తప్పి ప్రవర్తిస్తుంది. కోపము దూరాలను సృష్టిస్తుంది. భారాలను పెంచుతుంది. మానవత్వాన్ని దెబ్బ కొడుతుంది. పశుత్వాన్ని తెచ్చి పెడుతుంది. కోపంతో ఊగిపోయే మనిషి, 'నాకు కోపమొస్తే నేను మనిషిని కాను' అని పలుకుతూ ఉండటం మనం వింటూనే ఉంటాము. కోపం మానవత్వాన్ని నిర్మూలించి జ్ఞానాన్ని నశింప చేస్తుంది.

పనులు చక్కబెట్టు కోవడానికి, పరిస్థితుల్ని సరి చేసుకోవడానికి కోపం పనికొస్తుం దని చాలా మంది భావిస్తారు. అది సరైన అవగాహన కాదు. అలాగే తప్పు చేసే ప్రతి వాణ్ణి సరిచేయడానికి కోపం ఉపకరిస్తుందని కూడా భావిస్తారు. ఇదీ సరియైన అవగాహన కాదు. కోపిష్టిని వాస్తవానికి ఎవ్వరూ నచ్చరు. మెచ్చరు. కోపిష్టి ఏదీ సాధించ లేడు. తనను తాను పాడు చేసుకుంటాడు. అలాగే ఇతరుల్ని కూడా పాడు చేస్తాడు.

కోపం యొక్క కోరల్లో చిక్కి ఎన్నో కుటుంబాలు ముక్కలై పోయాయి. మరెన్నో సంబంధ బాంధవ్యాలు తెగి పోయాయి. కోపం మనల్ని మనం మరచి పోయేలా చేస్తుంది. ఆ తరువాత ఫలితాలను చూసి మనస్సు పశ్చాత్తాప పడుతుంది. దాని వల్ల ఏమి లాభం?

కోప్పడట మనేది మనకు చర్య లాగా కనిపించ వచ్చు. వాస్తవానికి అది చర్య కాదు; ప్రతిచర్య. ప్రతిచర్య లన్నీ యాంత్రికంగా జరిగి పోతాయి. చర్యలను మన అధీనంలో

ఉంచుకోగలం. ప్రతిచర్యలు మన అధీనంలో ఉండవు. ప్రతిచర్యలపై మనం పెత్తనం సాగించ లేము. ఏమండీ! ఈ పువ్వును వాసన చూడండి అని నేనంటే, మీరు చూస్తారు. ఏమండీ! అయిదు నిమిషాలు మీరు ఇప్పుడు కోప్పడండి అని అడిగా ననుకోండి. మీరు కోప్పడ గలరా? వాస్తవానికి అది చర్యే అయితే మీరు కోప్పడ గలరు. కాని కోపము అనేది చర్య కాదు; అది ప్రతిచర్య కనుక మీరు కోప్పడ లేరు. కోపం అనేది తనకు తానుగా వస్తుంది. యదార్థానికి కోప్పడే శక్తి నీకు ఉన్నా, అది ప్రతిచర్యగా సాగాలే గాని, ప్రయత్న పూర్వకంగా, చర్యగా సాగదు.

దీనిని బట్టి మనకు ఏమి అర్థ మవుతుంది? కోపం విషయంలో మనం అశక్తులం. కోపం తనంతట తాను వస్తుంది. మన అనుమతితో కోపం రాదు. వచ్చిన కోపాన్ని నిగ్రహించే శక్తి మనకు ఉండదు. ఈ సత్యాన్ని మనం అంగీకరించాలి. అప్పుడే మనం అపజయం నుండి బయట పడగలం. ఇది అర్థం కాకపోవడం చేత, 'ఏమండీ! కోప్పడకండి' అని మనం ఇతరులకు సలహాలిస్తాం. అంతే కాదు. మనం మంచి సలహా ఇచ్చినా, అతడు పాటించ లేదని ఏదో అయిపోతాం. అంతేగాని, ఆ సలహాను పాటించే శక్తి అతనికి లేదని గుర్తించము. ఇదే విచిత్రం.

కనుక, కోపం లేకుండా ఉండలేము. కాకపోతే, కోపం వచ్చే టప్పుడు, వస్తూ ఉందని తెలిసి నపుడు, కాస్త అవగాహనను పెంచుకొని, కోపాన్ని రానివ్వకుండా చూసుకొని, మనస్సులో శాంతి నశించకుండా ఉండేలా జీవించడం అలవాటు చేసుకోవాలి. అలా కాకుండా, ఒకవేళ మనకు కోపం వచ్చే పరిస్థితులు ఇతరుల కారణంగా ఆసన్న మైతే, అప్పుడేమి చేయాలి? దీనికి శాస్త్రము ఒక చక్కని ఉపాయాన్ని తెలియ చేసింది.

క్రుద్ధే స్మేర ముఖావధారణ మథావిష్టే ప్రసాదక్రమో ।
వ్యాక్రోశే వినయోక్తి రాత్మ దురితో చ్ఛేదోత్సవ స్తాడనే ॥

ఇతరులు మనపై కోపాన్ని ప్రకటించి నపుడు వారికి చిరునవ్వుతో కనిపించడం ***(క్రుద్ధే స్మేర ముఖావ ధారణం)***, పరులు కోపమొచ్చి వాళ్ళను వాళ్ళు మరచి నపుడు, వారిని ఊరడించడము లేదా ఓదార్చే ప్రయత్నము చేయడము ***(ఆవిష్టే ప్రసాద క్రమః)***, పరులు కోపంతో తిట్టినపుడు వారితో వినయంగా, వినమ్రంగా భాషించడము ***(వ్యాక్రోశే వినయోక్తిః)*** - ఈ విషయాలను దృష్టిలో ఉంచుకొని ఉచితానుచితాలను పరిశీలించి ప్రవర్తించ గలిగితే కోపాన్ని దగ్గరికి రాకుండా చూసుకోగలం.

కోపం లేకుండా ఉండలేము. కాకపోతే, కోపం రాకుండా జాగ్రత్త పడాలి. అప్పుడే మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. బ్రతుకు నిర్మలంగా సాగుతుంది. అస్తు.

శ్రీ ఆదిశంకరాచార్య స్వామి కృతం

గంగా స్తోత్రం

అనువాదం
శ్రీ స్వామీజీ

శ్లో॥ దేవి సురేశ్వరి భగవతి గంగే
త్రిభువన తారిణి తరల తరంగే ।
శంకర మౌళి విహారిణి విమలే
మమ మతి రాస్తాం తవ పద కమలే ॥ 1

సమస్త దేవతలను పాలించునది, భగవతి, పరిశుద్ధమైన తల్లి, త్రిభువనము లను దాటించునది, శుద్ధమైన తరంగాలతో శోభించునది, శంకరుని శిరము నందు విహరించునది, నిర్మల మైనది అగు గంగమ్మ తల్లి చరణ కమలముల యందు నా మనస్సు చల్లగా, మెల్లగా ఉండు గాక!

శ్లో॥ భాగీరథి సుఖదాయిని మాతః
తవ జల మహిమా నిగమే ఖ్యాతః ।
నాహం జానే తవ మహిమానం
పాహి కృపామయి మా మజ్ఞానమ్ ॥ 2

ఓ భాగీరథీ! సర్వులకు సుఖమును ప్రసాదించు తల్లీ! నీ జలముల వైభవమును శాస్త్రములు గొప్పగా వర్ణించాయి. నీ వైభవమంతా నాకు తెలియదు. ఓ కృపామయీ! అజ్ఞాని నైన నన్ను రక్షించు తల్లీ!

శ్లో॥ హరి పద పాద్య తరంగిణి గంగే
హిమవిధు ముక్తా ధవల తరంగే ।
దూరీకురు మమ దుష్కృతి భారం
కురు కృపయా భవ సాగర పారం ॥ 3

ఓ గంగాదేవీ! నీవు శ్రీహరి పాద పద్మముల నుండి కదలి వచ్చిన తల్లివి. నీ కెరటములు మంచును, చంద్రుని, ముత్యమును బోలిన తెలుపుతో ప్రకాశించు చున్నవి. నా పాప భారమును తొలగించి నన్ను భవసాగరము దాటునట్లు కృప చూపి కాపాడు తల్లీ!

శ్లో॥ తవ జల మమలం యేన నిపీతం
పరమపదం ఖలు తేన గృహీతం ।
మాత ర్గంగే త్వయి యో భక్తః
కిల తం ద్రష్టుం న యమ శ్శక్తః ॥ 4

ఓ గంగాదేవీ! నీ జలములు నిర్మలములు. పవిత్ర గంగోదకమును పానము చేయు భక్తుడు పరమోత్కృష్టమైన స్థితిని తప్పక పొందును. నీ భక్తుని చూచుటకు యమునికి శక్తి చాలదు.

శ్లో॥ పతితోద్ధారిణి జాహ్నవి గంగే
ఖండిత గిరివర మండిత భంగే ।
భీష్మ జనని హే మునివర కన్యే
పతిత నివారిణి త్రిభువన ధన్యే ॥ 5

ఓ గంగాదేవీ! జహ్ను మహాముని దుహితా! భీష్ముని మాతా! పతితులను ఉద్ధరించు పావన జననీ! హిమగిరిని ఢీకొని ఎగిసిపడే కెరటాలతో శోభించు తల్లీ! ముల్లోకములలో ధన్యమూర్తివి నీవే.

శ్లో॥ కల్పలతా మివ ఫలదాం లోకే
ప్రణమతి యస్త్వాం న పతతి శోకే ।
పారావార విహారిణి గంగే
విముఖ యువతి కృత తరలాపాంగే ॥ 6

ఓ గంగమ్మా! రెండు ఏటి గట్ల మధ్య క్రీడిస్తూ, ఈ లోకమున పెడమొగము పెట్టిన యువతి చూపుల వలె చలించు జననీ! కల్పలత వైన నీకు ప్రణమిల్లు వానిని దుఃఖము దరి చేరదు.

శ్లో॥ తవ చే న్మాతః స్రోతః స్నాతః
పునరపి జఠరే సోఽపి న జాతః ।
నరక నివారిణి జాహ్నవి గంగే
కలుష వినాశిని మహిమోత్తుంగే ॥ 7

అమ్మా! గంగాభవానీ! నరకమును నివారించు తల్లీ! పాపములను ప్రక్షాళనము చేయు జననీ! మహోన్నత మహిమ గల మాతా! నీలో మునక వేసిన వాడు మరల తల్లి గర్భమున ప్రవేశించడు.

శ్లో॥ పున రసదంగే పుణ్య తరంగే
జయ జయ జాహ్నవి కరుణాపాంగే ।
ఇంద్ర ముకుట మణి రాజిత చరణే
సుఖదే శుభదే భృత్య శరణ్యే ॥ 8

ఓ గంగాదేవీ! జాహ్నవీ! మలిన పూరితమైన నా దేహాంగములను నీ పవిత్ర కెరటాలతో తడుపు తల్లీ! దయా దృష్టి గల జననీ! ఇంద్రుని కిరీటము నందలి మణులచే శోభించు చరణములు గల తల్లీ! నీ సేవకులకు ఆశ్రయమై సుఖమును, శుభమును ప్రసాదించు మాతా! నీకు జయము - జయము!

శ్లో॥ రోగం శోకం తాపం పాపం
హర మే భగవతి కుమతి కలాపమ్ ।
త్రిభువన సారే వసుధా హారే
త్వమసి గతి ర్మమ ఖలు సంసారే ॥ 9

ఓ భగవతీ! త్రిభువన సార రూపిణీ! భూమాత కంఠాభరణమా! నా అజ్ఞాన వ్యాధిని, దుఃఖమును, బాధను, పాపమును, దుష్ట సంకల్పాలను నిర్మూలించు. ఈ సంసార జీవనమున నాకు గతివి నీవే.

శ్లో॥ అలకానందే పరమానందే
కురు కరుణాం మయి కాతరవంద్యే ।
తవ తట నికటే యస్య నివాసః
ఖలు వైకుంఠే తస్య నివాసః ॥ 10

అలకాపురి వాసులకు ఆనందము నొసగు తల్లీ! ఆర్తులచే పూజింప బడుతూ, ఆనంద దాయినివై శోభించు జననీ! నీ తీర సమీపమున నివసించు వారు వైకుంఠ వాసులే. నాపై కరుణ చూపు మాతా!

శ్లో॥ వర మిహ నీరే కమఠో మీనః
కిం వా తీరే శరటః క్షీణః ।
అథవా శ్వపచో మలినో దీనః
తవ నహి దూరే నృపతి కులీనః ॥ 11

ఓ గంగాదేవీ! నీ ఒడ్డున క్షీణించిన ఊసరవెల్లిలా బ్రతుకుట కన్నను నీ పవిత్ర జలములలో మత్స్య కూర్మాదులుగా ఉండుట మేలు. నీకు దూరమై ప్రభువుగా బ్రతుకుట కన్నా, నీ తీరమున దీనుడైన చండాలుడుగా తిరుగుట మేలు.

శ్లో॥ భో భువనేశ్వరి పుణ్యే ధన్యే
దేవి ద్రవమయి మునివర కన్యే ।
గంగాస్తవ మిమ మమలం నిత్యం
పఠతి నరో యస్స జయతి సత్యమ్ ॥ 12

ఓ భువనేశ్వరీ! దేవీ! ద్రవ రూపిణీ! పుణ్యవతీ! జాహ్నవీ! ధన్యవతీ! పవిత్రమైన ఈ గంగా స్తోత్రమును నిత్యము పఠించువాడు జయమును పొందును.

శ్లో॥ యేషాం హృదయే గంగా భక్తిః
తేషాం భవతి సదా సుఖముక్తిః ।
మధురాకాన్తా పజ్ఝటికాభిః
పరమానంద కలిత లలితాభిః ॥ 13

ఎవరికి గంగాదేవిపై హృదయమున భక్తి కలుగునో, అట్టివారు నిత్యము మధురముగా, అందముగా, పజ్ఝటికా వృత్తములో పరమానంద స్వరూపముగా సుందర రూపములో రచింపబడిన ఈ స్తోత్రమును పఠించుట చేత అప్రయత్నముగనే ముక్తిని పొందెదరు.

శ్లో॥ గంగాస్తోత్ర మిదం భవసారం
వాంఛిత ఫలదం విమలం సారం ।
శంకర సేవక శంకర రచితం
పఠతి సుఖీస్తవ ఇతి చ సమాప్తః ॥ 14

ఈ గంగా స్తోత్రము జగత్సార మైనది. వాంఛిత ఫలములను అనుగ్రహించునది. శుద్ధ మైనది. సత్యరూప మైనది. శివభక్తుడైన శంకరునిచే రచింప బడిన ఈ స్తోత్రమును పఠించువాడు సుఖమును పొందును. ఈ విధంగా ఈ స్తోత్రము సమాప్త మైనది.

చీకటి వెలుగులు



ఏదో ఏదో చేసేవాడు
ఏదో చెయ్యమని చెప్పేవాడు
ఏది చేయాలో, ఏ ఆలోచన చెయ్యాలో
చెప్పేవాడు ప్రచారకుడు.

ఎలా చెయ్యాలో చెప్పేవాడు
ఎందుకు చెయ్యాలో చెప్పేవాడు ప్రబోధకుడు.


ప్రచారము కర్మ.
ప్రబోధము జ్ఞానం.

జ్ఞానం లేని కర్మ తిమిరమే.
జ్ఞానం కలిగితే కర్మ తేజమే.

స్వామి సుందర చైతన్యానంద

భారతీయ సంస్కృతి - విశ్వ కళ్యాణం

{ 2002 వ సం॥ డిసెంబర్ 5,6 తేదీలలో పూజ్య శ్రీ స్వామి దయానంద సరస్వతి సారథ్యంలో హైదరాబాద్‌లో జరిగిన ధర్మప్రచార ప్రముఖ్ సభలో పూజ్య స్వామిజీ ఆంగ్లంలో ప్రసంగించిన స్వాగతోపన్యాసానికి ఆంధ్రానువాదం }



భారతదేశం పుణ్యభూమి. తపోభూమి. జ్ఞానభూమి. మహాత్ములు చరించిన పుణ్యభూమి. మహర్షుల హృదయాలలో కదిలిన పవిత్రజ్ఞానంతో పునీతమైన దేశం మనది. ఋషులు విడిచిన పవిత్రమైన గాలితో నిర్మలమైన జ్ఞానభూమి మనది. వేలాది సంవత్సరాలుగా ఈ పవిత్ర భారతదేశంలో మానవాళిపై ఆధ్యాత్మిక జ్ఞాన ప్రభావముంది.

అనాదిగా ప్రకృతి పురుషులు ఇక్కడ పరస్పరం ప్రేమతో, అవగాహనతో, సానుభూతితో జీవించారు. పక్షిని రక్షించేందుకు తన శరీరాన్ని కోసిపెట్టిన శిబి చక్రవర్తి అనే ఉశీనర మహారాజు చరించింది ఇక్కడే. ఒక దుష్టుడు స్త్రీని అపహరిస్తే, అతణ్ణి ప్రతిఘటించి ప్రాణా లర్పించిన జటాయువు అనే పక్షి విహరించింది ఇక్కడే. ఈ పుణ్య భారతావని లోనే.

ఋషులకు, మహర్షులకు, సంత్‌లకు, సాధువులకు, యోగులకు, త్యాగులకు నిలయమైన పుణ్యభూమి ఈ భారతావని.

ఇక్కడ ధర్మానికే పట్టాభిషేకం. త్యాగానికే సింహాసనం. సత్యానికే సన్మానం. మన జాతికి స్వార్థం తెలియదు. ద్రోహం అర్థం కాదు. మోసము, దగా, వంచన లాంటివి మన పూర్వీకుల పంచన నిలబడేందుకు సాహసించేవి కావు.

గడచిన చరిత్రనంతా ఒక్కసారి త్రిప్పి చూస్తే, మన దేశం మరొక దేశం మీద దండయాత్ర చేసిన సంఘటన మచ్చుకు ఒక్కటైనా కనిపించదు. ఇతరుల భాగ్యాన్ని ఆశించిన సందర్భం ఒక్కటి కూడా అగుపించదు.

స్వార్థం తెలియని మనపై స్వార్థపరులు దండెత్తారు. మన సంపదను అపహరించారు. మన సంస్కృతిలో చిచ్చు పెట్టారు. మనిషిని మనిషిని వేరు చేశారు. మమతల్ని కాలరాచారు. శాంతి నిలయంగా శోభించిన పవిత్ర దేశాన్ని అశాంతి నిలయంగా మార్చేశారు.

కొన్ని శతాబ్దాలుగా సాగిన పాశ్చాత్య కర్కశ పాలనలో జాతీయత కుంటుపడింది. విలువలు అడుగంటి పోయాయి.

ఈ రోజు మహాభారత గాథను మళ్ళీ విషాదంతో వీక్షిస్తున్నాం. మహాభారతంలో పాండవుల లాగా ధర్మం అరణ్యవాసం చేస్తోంది. నిజం చెప్పాలంటే, అజ్ఞాతవాసంలోకి వెళ్ళింది. స్వార్థం దుర్యోధనుని వలె పట్టాభిషేకం చేయించుకుంది. దాని ఫలితంగా నేడు భారతదేశం క్రూరుల, దుండగుల, హింసావాదుల చేతిలో ద్రౌపదిలాగా నలిగిపోతూ ఉంది.

ఆవేశాలకు హద్దులుంటాయి. ఉన్మాదానికి సరిహద్దు లుండవు. శత్రువులపై పగ సాధించటం, విరోధుల్ని హతమార్చటం వంటి విషయాలను గూర్చి విన్నాం. అమాయకుల్ని, నిర్దోషుల్ని, పసికందుల్ని నిర్దాక్షిణ్యంగా వధించడాన్ని ఏమనాలి? దీనిని సభ్యసమాజం జీర్ణించుకోలేక పోతోంది.

భక్తితో ఆలయాలకు వెళ్ళే భక్తులు భయంతో వెళ్తున్నారు. కొందరు వెళ్ళలేక మానుకుంటున్నారు. పవిత్రతకు నిలయాలైన ఆలయాలు రక్తంతో మలిన పడుతున్నాయి.

ఇటీవల కాలంలో, అంటే రెండు దశాబ్దాలుగా ప్రజల్లో ధార్మిక చింతన బాగా పెరిగింది. ఆధ్యాత్మిక స్పృహ జనావళిలో ఏర్పడింది. నలభై మంది విద్యార్థులను తరగతి గదిలో కూర్చోబెట్టి ప్రశాంతంగా బోధించలేని స్థితిలో విద్యా విధానం మూలుగుతూ ఉంటే, మైదానాలను తరగతి గదులుగా మార్చి, వేల సంఖ్యలో జనాన్ని నిశ్శబ్దంగా కూర్చోబెట్టి ప్రవచనాలను శ్రవణం చేయించారు గురువులు, సాధువులు, ధర్మప్రచార ప్రముఖులు. అలాంటివారు నేడు మన మధ్య ఈ సభలోనే ఉన్నారు.

కాని, పరిస్థితి నేడు మారుతూ ఉంది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే రాబోయే రోజుల్లో సభలు, సదస్సులు నిర్వహించడం కూడా కష్టమే అవుతుంది. ధర్మప్రవచనాలు కూడా ప్రజలకు అందుబాటులో లేకుండా పోతాయి.

స్వతంత్ర భారతదేశంలో సంస్కృతీ పరిరక్షణ విషయంలో ఇప్పటికే పెద్ద అగాధం ఏర్పడి ఉంది. ఎలాగైనా దానిని భర్తీ చెయ్యాలి.

1947 ఆగష్టు **15**వ తేది మన దేశానికి స్వాతంత్ర్యం లభించింది. శతాబ్దాల బానిసత్వానికి తెరపడింది. విదేశీపాలనలో ఛిన్నాభిన్నమైన ఇంటిని సరిజేసుకోవలసిన బాధ్యత స్వదేశీయులపై బడింది. సంస్కృతిని పునర్జీవింప చేసే గురుతర బాధ్యత పాలకులపై పడింది.

దురదృష్టం. అర్ధ శతాబ్దము నిండిన స్వతంత్ర భారతదేశంలో సంస్కృతీ వైభవాన్ని పునః నిర్మించుకొనే ఆలోచన నాయకుల్లో కలగక పోవడమే గాక, సంస్కృతీ సంప్రదాయాలు శాశ్వతంగా మరుగున పడిపోయే రీతిలో చెలరేగిన కార్యక్రమాలకు పదవీ దాహంతో మన నాయకులు ఊపిరి పోయడం కూడా మన కళ్ళముందే జరిగింది. జరుగుతూ ఉంది.

ఫలితమేమిటి? దేశం ఛిన్నాభిన్నమై నిలిచి ఉంది. మోసం అడుగడుగునా మకాం పెట్టింది. సత్యము శిలువ వేయబడింది. మంచితనం మాయమైంది. విద్యావిధానం వెర్రితలలు వేస్తోంది. అబద్ధాలు పరిపాలిస్తున్నాయి. అరాచకాలు, లంచాలు యంత్రాంగంగా నిలిచాయి. ప్రభుత్వాలలో గందరగోళం ఏర్పడింది.

దేశద్రోహులు విదేశీ మతోన్మాదులతో చేతులు కలిపి విధ్వంసం సృష్టిస్తూ ఉంటే, రాజకీయ నాయకులు అరాచకంగా, అప్రజాస్వామ్య పద్ధతులలో దేశాన్ని పాలిస్తున్నారు. అందరూ కలిసి మాతృభూమిలో శాంతిని, సౌభాగ్యాన్ని నాశనం చేస్తున్నారు.

ఈ స్థితిని మార్చేందుకు, ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు, అధర్మపు మండు టెండల్లో కాలిపోయిన భూమిని తడిపి చల్లబరచేందుకు, సమాజ గగనంలో ధర్మమేఘాలు దర్శన మిచ్చాయి. అదే ఈ ధర్మప్రముఖ పరిషత్.

మహాత్ములారా! మాననీయులారా! స్నేహితులారా!

దేశంలో అధర్మం, హింస అగ్రస్థానంలో ఉన్నాయి. ఏ సంస్థ అయినా ఒంటరిగా చేసే ప్రయత్నంలో వీటిని తరిమికొట్టలేదు. దీనికి ఒక శక్తి కావాలి. ధార్మికసంస్థ లన్నీ సంఘీభావంతో చేతులు కలిపి, ఐక్య కార్యాచరణలో కాలిడి నప్పుడే అట్టి శక్తి ఉత్పాదన జరుగుతుంది. ఈ విషయాన్ని మనస్సులో ఉంచుకొని, సహకార దృక్పథంతో, సుహృద్భావంతో పని చేయగలిగితే మనం తలపెట్టిన కార్యాన్ని సాధించగలం. హిందూ సమాజాన్ని చక్కగా పరిరక్షించగలం.

హిందూసమాజ పునరుద్ధరణకు అందరిని అక్కున చేర్చుకోగల విశాల హృదయు లైన పూజ్య స్వామి దయానందజీ మన మధ్య ఉన్నారు. ఆ మహాత్ముని సహచర్యంలో, మార్గదర్శకంలో ఏ సేవలైనా అందించగలం. దేశంలో శాంతిధర్మాలను నెలకొల్పగలం.

సుందర చైతన్యాశ్రమం స్థానిక ఆశ్రమం. అందుకే నేమో, పూజ్య స్వామి దయానందజీ స్వాగతోపన్యాసం చేసే అవకాశాన్ని నాకిచ్చారని భావిస్తున్నాను. పూజ్య స్వామీజీకి నా భక్తిపూర్వక నమస్కృతులను సమర్పించుకుంటూ, మీ అందరికి మనఃపూర్వకంగా ఆహ్వానం పలుకుతున్నాను.

ఈ ధర్మప్రచార ప్రముఖసభ భారతజాతిని పూర్వ వైభవంతో, సంస్కృతీ సంప్రదాయాల మార్గంలో నడిచేందుకు మార్గాన్ని నిర్దేశిస్తుందని, భారతీయ సమాజాన్ని లోకకళ్యాణం దిశగా, శాంతి మనుగడను సాగించే మార్గంలో నడుపుతుందని నేను ప్రగాఢంగా విశ్వసిస్తున్నాను.

అంతేకాదు. భారతదేశంలో గోచరించే ఈ శుభ పరిణామాన్ని దర్శించి, యావత్ప్రపంచం పరివర్తన దిశగా పయనిస్తుందని భావిస్తున్నాను.

లోకా స్సమస్తా స్సుఖినో భవంతు

నిత్య పూజ

స్వామి సుందర చైతన్యానంద



ప్రయత్నము, కాలము, దైవము - ఈ మూడు అనుకూలిస్తేనే ఏ కర్మకైనా పూర్ణ ఫలం అందుతుంది. మొక్కలు నాటడం, ఎరువు వేయడం, నీరు పోయడం తోటను పెంచే ప్రయత్నాలు. ఆధ్యాత్మిక జీవనంలో స్వాధ్యాయము, శ్రవణము అనే సాధనలు మొక్క నాటడం వంటివి. సాధన అనే మొక్క ఆరోగ్యంగా పెరిగితే ఆ మొక్కలో భక్తి అనే పువ్వు పూస్తుంది. భక్తి పుష్పం విరజిమ్మే సౌరభమే భక్తుడి లక్షణాలు. పువ్వు క్రమేపి పిందెగా మారుతుంది. సాధకుడి లోని అహంకార మమకారాలు, కర్తృత్వ భోక్తృత్వ భావనలు అనే అజ్ఞాన లక్షణాలు పిందె లోని చేదు, వగరు, పులుపు వంటివి. చెట్టును అంటి పెట్టుకొని ఉన్న పిందెలో క్రమేపి ఇవన్నీ మాయమై ఒక దశలో అది కాయగా మారి పండు అవుతుంది. అదే విధంగా కర్మయోగంలో సాధకుడు పరిపక్వత చెందుతూ ఉండగా కర్తృత్వ భోక్తృత్వాలు అదృశ్యమై జ్ఞానమనే పండు అందుతుంది. అదే మోక్షఫలం. సాధన లన్నీ హృదయ పరిపక్వత కొరకే.

సర్వం కర్మాఖిలం పార్థ జ్ఞానే పరిసమాప్యతే. అన్ని కర్మలు, సాధనలు జ్ఞానంలో పరిపూర్ణతను పొందుతున్నాయి. ప్రేమలో పూర్ణత్వమే భక్తి. భక్తి లేనిదే జ్ఞానం రాదు. ప్రాపంచిక ప్రేమలు బాధిస్తాయి, బంధిస్తాయి. శివుడి మీద ప్రేమ బంధ విముక్తికి కారణ మవుతుంది. సంసారంలో ప్రేమలు పాశాలు. పాశం చేత బంధింపబడే ప్రాణి పశువు. అందరము బంధంలో ఉన్న వారమే కనుక అందరము పశువులమే. పశువులను విడిపించేవాడు పశుపతి.

ఇదం జగత్ సర్వం ఈశ్వర బుద్ధ్వా ఆచ్ఛాదనీయం

దేని నైతే లింగం ప్రతిపాదిస్తూ ఉందో అది లింగ్యం. శివలింగం ప్రతిమ. శివనామం ప్రతీక. లింగం సగుణము, నిర్గుణము రెండూ అయి ఉంది. కనిపిస్తూ ఉంది కనుక సగుణం. కనిపించినా తత్త్వం అర్థం కావడం లేదు కనుక లింగం నిర్గుణం.

ఆత్మా త్వం గిరిజామతిః ప్రియజనాః ప్రాణాః శరీరం గృహం
పూజా తే విషయోప భోగరచనా నిద్రా సమాధి స్థితిః।
సంచారః పదయోః ప్రదక్షిణ విధి స్తోత్రాణి సర్వా గిరః
యద్యత్ కర్మ కరోమి తత్తదఖిలం శంభో తవారాధనమ్॥

'శివా! నా ఆత్మవు నీవే. పార్వతీదేవి నా మనస్సు. ప్రమథ గణాలు నా పంచప్రాణాలు. నా దేహమే నీ గృహం. నా జ్ఞానేంద్రియాల ద్వారా నేను పొందే సమస్త విషయానుభవాలను నీకు సమర్పించుటయే పూజ. నిద్రయే సమాధి. నా పాదాలు ఎక్కడ సంచరించినా ఆ సంచార మెల్లా నీకు ప్రదక్షిణలే. నేను పలికే ప్రతి మాట నీ స్తోత్రమే. నేను చేసే ప్రతి కర్మ, హే శంభో! నీ ఆరాధనమే' అంటూ సాధ్య సాధనాలు రెండూ తానే అయిన శంకరుణ్ణి అంతఃకరణ శుద్ధి మరియు అసంగత్వము కొరకు ప్రార్థించి సిద్ధిని పొందాలి.

హనుమంతా! నీదే భారమంతా!

స్వామి సుందర చైతన్యానంద

రాజుల్ని జయిస్తే రాజ్యాలు లభిస్తాయి. నిన్ను నీవు జయిస్తే సుఖశాంతులు ప్రాప్తిస్తాయి. ఈ సత్యాన్ని చాటి చెప్పడమే గాక, చేసి చూపిన మంగళ మహనీయ మూర్తి హనుమంతుడు.



రామాయణంలో రమణీయ మూర్తి ఆంజనేయస్వామి. రామాయణం - కిష్కింధ కాండలో ప్రథమంగా ఆయన దర్శన మవుతుంది. **సంభ్రమః త్యజ్యతాం** - 'భయాన్ని త్యజించండి' అనే అభయ వాక్యంతో హనుమంతుడు గోచరిస్తాడు. కనుకనే, భయాలలో, బాధలలో చిక్కుకు పోయిన వారందరూ, **హనుమంతా! నీదే భారమంతా!** అని సమస్తాన్ని వాయుపుత్రుని పాదముల వద్ద సమర్పించి, రక్షణ లభించిందని హాయిగా గాలి పీల్చుకుంటారు.

అశోక వనంలో సీతమ్మ కూడా ఆ పనే చేసింది. తన భారాన్ని మోయమని, బాధను తొలగించమని, ఆంజనేయస్వామిని అర్థించింది.

త్వమస్మిన్ కార్య నిర్యోగే
ప్రమాణం హరి సత్తమ।
హనుమన్ యత్న మాస్థాయ
దుఃఖక్షయ కరోభవ॥

'హనుమంతా! నీదే భారమంతా! నా కార్యాన్ని నిర్వహించే బాధ్యత నీదే. నీవే ఆలోచించాలి. నీ ప్రయత్నంతో నా దుఃఖాన్ని పోగొట్టు' అన్నది సీతమ్మ. **తథేతి** - అలాగే అన్నాడు హనుమంతుడు. అలాగే చేశాడు. సీతమ్మ దుఃఖాన్ని పోగొట్టాడు.

మనమూ ఆంజనేయస్వామిని ఆశ్రయిద్దాం. అవగాహనతో, భక్తితో చరిస్తూ, ఆపదలు, భయాలు మన జీవితంలో వచ్చినపుడు ఈ శ్లోకాన్ని భక్తితో పఠించి రక్షణ పొందాలి.

ఆంజనేయస్వామిని ఆరాధించడము అంటే ఆ దివ్యాత్ముని లోని అసమాన వైభవమును చక్కగా దర్శించి, దానిని మన బ్రతుకులలో ప్రదర్శించడ మని అర్థము.

ఆంజనేయస్వామి రామభక్తుడు. రామకార్యంలో అలుపెరుగని వాడు. అభిరుచులను, ఆతిథ్యాలను మరచిన వాడు. భయ మెరుగని వాడు. సముద్రాన్ని దాటడానికి కూడా వెనుకాడని వాడు. అంతటి వాడైనా అహంకారము తెలియని వాడు. వినయమును వదలని వాడు. నిర్వేదమును పొందని వాడు. ఇంద్రియ నిగ్రహముతో, అకుంఠిత కార్యదీక్షతో జీవితమును సాగించి, భక్త లోకానికి ఆదర్శమై భాసించాడు. ఆ మహాత్ముని బాటలో మనమూ చరించి తరించెదము గాక!



మహాజనో యేన గత స్స పంథాః - 'మహాత్ములు వెళ్ళిన మార్గమే మార్గము' - ఈ మహా వాక్యాన్ని నిరంతరం మదిలో పదిల పరచుకొని హనుమంతుని పవిత్ర బాటలో సదా మనమూ పయనించి తరించెదము గాక!

పవనసుత హనుమాన్ కీ జై!

అతి బలవంత హనుమంతా!

అతి బలవంత హనుమంతా నీవే అంతా!
అంజని పుత్ర హనుమంతా లేదు చింత!
నీవు మాకు తోడుంటే సుఖమే బ్రతుకంతా!
ఏది ఉండినా, ఏది ఊడినా అంతా నిశ్చింత! ॥ అతి ॥

వానరవీర మారుతి దయ చూపు రవ్వంత!
సమయము దాటితే ఎందుకు సాయం కొండంత!
లలిత లలిత పదజాలంతో రాసెద నీ చరిత!
నను కరుణించి కాపాడితే పాడెదను వంత! ॥ అతి ॥

బలవంతుడవు నీవని పలికెదరు అంతా
మా బలహీనతలు పారద్రోలితే నమ్మెదము కొంత
ఎపుడో ఏదో చేసితే ఎవరికి గురుతంతా
ఏదో ఇపుడు కొంత చేసినా నమ్మెదము అంతా ॥అతి॥

ఓ కథ చెప్పనా!

స్వామి సుందర చైతన్యానంద

ధ్యాస - ధ్యానము

ఋషభుని కుమారుడు భరతుడు. అజనాభము అనే దేశాన్ని పాలించిన రాజు. ఎన్నో యజ్ఞాలు చేశాడు. ప్రజలను పరమ వాత్సల్యంతో ప్రేమించాడు. పాలించాడు. మహాభక్తుడు. ఆయన వల్లనే మన దేశము భారత దేశము అనే పేరును పొందింది.



జింక చర్మాన్నే వస్త్రంగా ధరించేవాడు. ముక్తి మార్గంలో రాజ్యం కూడా ప్రతిబంధకమే నని, సమస్తాన్ని త్యజించి, కఠోర సాధనను కొనసాగించాలని పులహాశ్రమం చేరాడు. భోగాలు అనుభవించ వలసిన వయస్సులో సర్వమును త్యజించి, రాజ్యాన్ని బిడ్డలకు అప్పగించి సన్యసించాడు.

ఒకనాడు నదీ తీరమున ధ్యానమగ్నుడై ఉన్నాడు భరతుడు. అక్కడకు ఒక గర్భిణి అయిన లేడి వచ్చింది. ఈ లోగా ఆ వనం లోని సింహ మొకటి గర్జించింది. భీతి చెందిన హరిణి నదిని దాటేందుకు ఎగిరి దుమికింది. జింకపిల్లను ప్రసవించి తల్లి జింక మరణించింది.

భరతుడు చలించి పోయాడు. తల్లిని పోగొట్టుకున్న బిడ్డను ఆశ్రమానికి తెచ్చుకున్నాడు. ఆ హరిణ పోతమును పెంచుతూ దాని మీద ఎనలేని ప్రేమను పెంచు కున్నాడు. జపధ్యానాదులు దూర మయ్యాయి. హృదయంలో జింకపిల్లే నిండి పోయింది. దాని ధ్యాస లోనే బ్రతుకు గడిచి పోయింది. మరణ సమయంలో కూడా భరతుని మనస్సులో జింకపిల్లే ఉండి పోయింది. దాని ఫలితంగా మరణించిన భరతుడు మరుజన్మలో జింకగా పుట్టవలసి వచ్చింది. ఆ తరువాత తరించడానికి రెండు జన్మలు ఎత్తవలసి వచ్చింది. ఇదే కామ వైపరీత్యము.

కోరికల్ని కదలించే శక్తి మనిషి మనసుకు ఉంది. కోరిన ప్రతి దానిని సాధించుకొనే శక్తి మాత్రం మనిషికి లేదు. మనిషి సర్వాన్ని కోరుకోవచ్చు. కాని, దానిని పొందడానికి తనకు సర్వ శక్తిమత్వం లేదు అనేది మరచి పోకూడదు.



చైతన్య ప్రభంజనం

శ్రీ డి.వి.ఎన్.మల్లికార్జున శర్మ

రమతే యమునా....

శ్రీశ్రీశ్రీ స్వామి సుందర చైతన్యానంద సద్గురుదేవులు హైదరాబాదు లోని సుందర చైతన్యాశ్రమంలో 25-1-2026 నుండి 15-3-2026 వరకు ప్రతి ఆదివారం జగద్గురు శ్రీ ఆదిశంకరాచార్య విరచిత 'తత్త్వబోధ' పై దివ్య ప్రవచనములను అనుగ్రహించుట 'గిరిధారి' పాఠకులకు తెలిసిందే!

పూజ్య గురుదేవులు 'తత్త్వబోధ'ను 2015 లోను, 2026 లోను భగవద్గీత బోధనా తరగతులకు ముందుగా, వేదాంత అధ్యయనానికి పునాది తరగతులు గానే బోధించడం మన అదృష్ట భాగ్య విశేషం.

'తత్త్వబోధ' సమాప్తి అయిన తరువాతి ఆదివారమే భగవద్గీత లోని 12వ అధ్యాయము 'భక్తి యోగము'పై పూజ్య గురుదేవుల అద్భుత దివ్య ప్రవచనాలు ఆరంభమైనాయి.

పూజ్య గురుదేవులు 1970 దశకం నుండి తెలుగు రాష్ట్రాల్లోని అనేక పట్టణాలలో 'భక్తియోగము' ప్రధాన బోధనాంశముగా నిర్వహించిన జ్ఞానయజ్ఞములు లక్షలాది ప్రజలను భక్తి మార్గానుయాయులుగా తయారుచేసి ఆధ్యాత్మిక రంగంలో ఒక మహోద్యమాన్ని ఆరంభించి వ్యాప్తి చేసినవి. అదే స్ఫూర్తిని నేటి తరానికి కూడా పూజ్య గురుదేవులు అనుగ్రహిస్తూండటము తెలుగు వారి పురాకృత పుణ్యఫలము.

ప్రతి ఆదివారం ఉదయం 10 గం॥ నుండి సుమారు రెండు గంటల పాటు హైదరాబాదు సుందర చైతన్యాశ్రమంలో పూజ్య గురుదేవులు అనుగ్రహిస్తున్న గీతోపన్యాసము లను శ్రవణం చేయుటకు అందరూ ఆహ్వానితులే కావడం వలన ఎందరో ఈ సదవకాశాన్ని సద్వినియోగ పరచుకొని ప్రయోజనాన్ని పొందుతున్నారు. ఈ విధంగా ఈ తరగతులను ప్రతి వారము పూజ్య గురుదేవులు అనుగ్రహిస్తున్న 'జ్ఞానయజ్ఞము'లని భావించుట అతిశయోక్తి కాదు. ఇందుకు తార్కాణముగా 'తత్త్వబోధ' సమాపనోత్సవములో సుందర సత్సంగ్ రాజమండ్రి వారు, 'భగవద్గీత' ప్రారంభోత్సవంలో సుందర సత్సంగ్ మహబూబ్‌నగర్ వారు పూజ్య గురుదేవుల ఆశీస్సులతో పాల్గొన్నారు. సుందర సత్సంగ్ సభ్యులు ఇతర ప్రాంతముల నుండి కూడా పూజ్య గురుదేవుల గీతోపన్యాసములకు హాజరవుతున్నారు.

పూజ్య గురుదేవుల 'భగవద్గీత' ప్రవచనముల ప్రారంభ తరగతిలో స్వాగత వచనములలో శ్రీ వి.వి.ఎస్.సీతారామం గారు చెప్పినట్లుగా వసంతాగమనాన్ని ముందుగానే తెలుసుకొని కోయిల కూజించినట్లుగా పూజ్య గురుదేవులు సాధక లోకానికి ఎప్పుడు ఏ

బోధ హితకరమో ఆచార్య హృదయముతో ముందుగానే గ్రహించి దానినే మనకు అనుగ్రహిస్తారు. ఆ విధంగా పూజ్య గురుదేవుల శిష్య వాత్సల్య ఫలములే ఈ దివ్య ప్రవచనములు!

శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదినాన పూజ్య గురుదేవులు దర్శన భాగ్యాన్ని ప్రసాద వితరణతో అనుగ్రహించి ఆశీర్వదించారు. ఆశ్రమ ప్రాంగణంలో నూతనంగా నిర్మితమైన శ్రీ బాలరామ, శ్రీ భక్తాంజనేయ స్వాముల ఆలయములలో పూజ్య గురుదేవులు శ్రీరామనవమి, శ్రీ హనుమజ్జయంతి పర్వదినాలను పురస్కరించుకొని విశేష పూజలు, హనుమాన్ చాలీసా పారాయణలతో పాటుగా భజన గానామృతాన్ని అనుగ్రహించి దీవించారు. భక్తియోగము లోని రెండవ శ్లోకము 'మయ్యావేశ్య మనో యేమాం . . .' ను పూజ్య గురుదేవులు వ్యాఖ్యానిస్తూ ఉపమానంగా యమునానది మహత్తును కీర్తిస్తూ **'రమతే యమునా పులినవనే'** అనే జయదేవ అష్టపదిని మనోహరంగా గానం చేశారు. ఈ సంవత్సరం రాబోయే యమునానది పుష్కరాలకు పూజ్య గురుదేవులు వత్సర ప్రారంభం లోనే ఆలపించిన స్వాగత గీతముగా భావించుకుంటున్నాము.

పూజ్య గురుదేవులు ప్రవచనానంతరం ఒక నూతన చైతన్య గానాన్ని ప్రతి వారము అనుగ్రహిస్తున్నారు. ఇంతవరకు అందిన నూతన గీతాలు : (1) నా కంటి వెలుగువు (27.3.26) (2) శుభచరితం రసభరితం (27.3.26) (శ్రీరామనవమి, హనుమజ్జయంతి ప్రత్యేకం) (3) ఏడ్చే వారే అందరూ (5.4.26) (4) చేయగలిగిందే చేయలేము (12.4.26) (5) కృష్ణా. . . నాలో నీవు ఉంటివా (19.4.26). ప్రతి వారం ఒక్కొక్క సత్సంగ సభ్యులు మోక్షధామమున జరుగు పూజ్య గురుదేవుల భగవద్గీతా జ్ఞానయజ్ఞములలో పాల్గొనుట పూజ్య గురుదేవుల వాత్సల్య పూర్వక ఆశీఃఫలము. ఇంతవరకు గుంటూరు (ఎ.టి.అగ్రహారం, లాలుపురం) సుందర సత్సంగము వారు రెండు బస్సుల్లోను, కార్ల లోను వచ్చి పూజ్య గురుదేవుల దివ్య అనుగ్రహాన్ని ప్రసాదంగా అందుకున్నారు.

తరువాతి వారం గీతోపన్యాసానంతరం పూజ్య గురుదేవులకు **స్వర్ణ అంగుళీయకాన్ని** అలంకరించి శ్రీ నాగేశ్వరరావు గారు (కర్నూలు) తమ గురుభక్తిని ప్రకటించుకున్నారు. హనుమత్ సీతా లక్ష్మణ సహిత శ్రీరామచంద్ర దివ్య మూర్తులను ఒక ఉంగరంలో అతి నైపుణ్యంతో చెక్కడాన్ని శ్రీమతి సి.పద్మ గారు తమ స్వాగత వచనాలలో ప్రశంసిస్తూ పరిచయం చేశారు. ఆ వారం (12.4.26) కర్నూలు సత్సంగ్ వారు పూజ్య గురుదేవుల ప్రత్యేక దర్శన భాగ్యాన్ని పొందారు.

పూజ్య గురుదేవుల అనుగ్రహాన్ని దక్కించుకున్న భాగ్యశాలురు 13.4.26 న నిజామాబాద్ సత్సంగ్ వారు. అదే రోజున శ్రీ వనపర్తి రాములు దంపతులు పూజ్య గురుదేవుల దక్షిణ హస్తానికి **స్వర్ణ కంకణాన్ని** అలంకరించి ఆనందించారు.

పూజ్య గురుదేవుల ఇప్పటి గీతోపన్యాసములు కూడా **'యూట్యూబ్'** లో ప్రతి బుధవారం ఉదయానికే లభ్యం అవుతూ విశ్వవ్యాప్తి నొందుట మన భాగ్యము!

(సర్వమ్ శ్రీశ్రీశ్రీ స్వామి సుందర చైతన్యానంద సద్గురు దివ్య చరణార విందార్పణ మస్తు!)



ఆత్మ బంధువులారా,
ఓం నమో భగవతే వాసుదేవాయ.

సాధన విషయంలో ఆధ్యాత్మిక సాధకులకు అనేక విషయాలు తెలిసి ఉండినా, "సాధన కష్టమైన కార్యము కాదు" అనే ముఖ్య విషయము మాత్రము చాలా మందికి తెలియదు. ఇక్కడే సాధకులు తెలియకుండానే బండబరువును సాధనలో మోస్తూ ఉంటారు.

ఇష్టమైన వ్యక్తిని మనం ప్రేమిస్తూ ఉన్నాము. ఇష్టమైన వారిని గూర్చి ఎవరైనా చెబుతూ ఉంటే శ్రద్ధగా వింటున్నాం. లేదా, మనమే ప్రేమతో పలుకుతున్నాం. ఇష్టమైన కార్యాలను శ్రద్ధతో, ఉత్సాహంతో చేస్తున్నాం. ఈ విషయాల్లో ఎక్కడ కూడా కష్టం తెలిసిరావటం లేదు.

ఉదయించే సూర్యుని అందాన్ని చూస్తున్నాం. సముద్రంలో లేచిపడే అలలను చూస్తున్నాం. ఎత్తైన ఆలయ గోపురాన్ని చూస్తున్నాం, పచ్చని పొలాలను, పర్వత శ్రేణులను చూచి ఆనందిస్తున్నాం. ఈ కార్యాలలో కష్టం ఉందా?

లేదు. అయితే పరమాత్మ కొరకు మనం ఆచరించే సాధనలలో కూడా లేనట్లే. పువ్వులోని అందాన్ని చూడటానికైనా నేను కొద్దిగా ప్రయత్నించాలేమో గాని పరమాత్మను దర్శించటానికి ఆ మాత్రం ప్రయత్నం కూడా అవసరం లేదు. పరమాత్మ ఎవరో కాదు; మన స్వరూపమే. ప్రాణానికి ప్రాణమైనవాడు. మనసుకు మనసైన వాడు. మనసు వెనుక మహిమ తానై శోభించువాడు.

తూర్పున సూర్యోదయం జరుగుతూ ఉంటుంది. అభిముఖంగా బాటసారి నడుస్తూ ఉంటాడు. అతడు నడుస్తూనే ఉంటాడు. పుణ్యకాలం కాస్త కారిపోతుంది. ఏదో ఆలోచిస్తూ ముందుకు పోతూ ఉంటాడే గాని అందమైన సూర్యోదయాన్ని వీక్షించడు. కళ్ళ ముందే కాంతులు దివ్యంగా పరచియున్నా, దర్శించి ఆనందించే భాగ్యానికి నోచుకోడు.

ఉన్నది ఏదైనా తెలియకుండా ఉన్నంత వరకు ఆ ఉన్నది ఉండినా ప్రయోజనం ఉండదు. "ఉన్నది - తెలియకుండా ఉన్నది". అన్నీ జీవితంలో ఇలాగే ఉన్నాయి.

కష్టాలు లేనివారు ఎవరు ఈ ప్రపంచంలో? అలా ఉన్నట్లు తెలిసినవారు ఎందరున్నారు? కష్టాలు పడటం వేరు. వాటి పూర్వాపరాలను అర్థం చేసుకోవటం వేరు.

"ఎన్ని కష్టాలొచ్చినా అతడికి కనువిప్పు కలుగలేదు. బాధలు చుట్టుముట్టినా అతడి మనసు భగవంతుని వైపు మరలటం లేదు" అని చాలా మంది అంటూ ఉండటం మీరు వింటూనే ఉంటారు.

బాధలున్న వారు బాధల నుండి విడిపడేందుకు అన్యులను ఆశ్రయిస్తారు కాని భగవంతుని వైపు ఎందుకు తిరుగుతారు? ఆకాశాన్ని మేఘాలు క్రమ్మినట్లు మనిషిని కష్టాలు చుట్టేస్తే, దిక్కు తోచక మనిషి దుఃఖించగల డేమో గాని ప్రార్థించగలడా? బోరున విలపించగల డేమో గాని తన హృదయావేదనను పరమాత్మకు వినిపించగలడా?

బాధ లున్నంత మాత్రాన భగవంతుడు తెలిసిరాడు. బాధలను గుర్తించాలి. అర్థం చేసుకోవాలి. మన ప్రయత్నంతో గాని, ఇతరుల సహకారంతో గాని బ్రతుకులో బాధలు దూరం కావు అనే గొప్ప సత్యాన్ని బుద్ధి దర్శించగలగాలి. అంతే కాదు. జీవితంలో ఎదురయ్యే ఉపద్రవము లన్నిటినీ తొలగించి, అనంతానందమును ప్రసాదించే శక్తి పరమాత్మకే ఉంది అనే సత్య విషయం అర్థం కావాలి. అప్పుడే మనసు భగవంతుని వైపు తిరుగుతుంది. అంతవరకు కష్టాలు ఉంటాయి. కాని అర్థం కాకుండా ఉంటాయి.

అర్థమైతే, సాధన కష్టం కాదు. ప్రేమ కార్యాలలో కష్టా లుండవు. మనం ప్రేమించే వారికి, వారిపై మనకున్న ప్రేమకి పెద్ద తేడా లేదు. సాధ్యరూపుడైన పరమాత్మకు, పరమాత్మకు సంబంధించిన సాధనకు మధ్య కూడా పెద్ద తేడా లేదు. అది గ్రహించిన మరుక్షణం నుండి సాధన గాలిలాగ తేలిపోతూ ఉంటుంది. తేలికగా ఉంటుంది. ప్రతి క్షణం మనస్సులో పరమాత్మే తేలుతూ ఉంటాడు. ప్రపంచం మునుగుతూ ఉంటుంది.

"భావగ్రాహి జనార్దనః". మన భావాన్ని గ్రహించేవాడు భగవంతుడు. కాదు కాదు; మన భావాన్ని భగవంతుడే గ్రహించగలడు. తనకంటూ పరమాత్మకు భావాలు లేవు. కనుక నీ భావాలను అర్థం చేసుకుంటాడు. ఇతరుల పరిస్థితి వేరు. వాళ్ళు తమ భావాలను జోడించి మనల్ని అర్థం చేసుకొనే ప్రయత్నం చేస్తారు. అందుచేతనే ఈ ప్రపంచంలో ఎవరూ ఎవరికి అర్థం కాకుండా మిగిలిపోతారు.

పరమాత్మ నీ భావాల్ని గ్రహిస్తాడు. నీ మొర వింటాడు. నీ మాటల్ని ప్రేమతో ఆలకిస్తాడు. ఎలా పిలిచినా పలుకుతాడు. పరమాత్మ మెచ్చుకొనే టంతటి గొప్ప భాష మన వద్ద లేదు. మనం భావ స్ఫూర్తితో ఏది పలికినా, అది పరమాత్మకు ప్రియంగా ఉంటుంది. నీ పలుకుల్లో వ్యాకరణ దోషా లున్నాయని పరమాత్మ నీకు దూరంగా పోడు. మనలోని వ్యాకరణ వైభవాన్ని చూచి మనల్ని గుర్తించటానికి పరమాత్మ మేష్టారు కాదు. పరమాత్మకు కావలసింది భాషావేత్తలు కారు; భక్తులు. భక్తులలో భాషా వైభవం తొంగి చూడవచ్చు. భాష ఉన్నవా రందరూ భక్తులు కాలేరు.

మనం భక్తులం కావాలి. ఏం చేయాలి? భక్తి చేయాలి. ఇంకేం చేస్తాం? మరేదో చేస్తే మరొకర మవుతా మేమో గాని భక్తులం ఎలా అవుతాము? ఒక నిర్జన ప్రదేశంలో నడచి వెళ్తున్నాము. మార్గమధ్యంలో ఒక చెట్టు క్రింద కూర్చుని కళ్ళు మూసి భగవంతుని

ప్రార్థిస్తున్నాం. అప్పుడు మన మెక్కడున్నాం? చెట్టు క్రింద లేము. ఆలయంలో ఉన్నాం. పరమాత్మ మన మనస్సులో కదిలిన క్షణాన మన దేహం దేవాలయం అవుతుంది. **"దేహో దేవాలయః ప్రోక్తః"**. దేహము దేవాలయంగానే ఉంది. కాని, తెలియ కుండా ఉంది. భక్తి చేయగనే తెలియనిది తెలుస్తుంది. దేహ మున్నంత మాత్రాన అది దేవాలయం కాలేదు. భావన చేరితేనే, భక్తి భావన చేరితేనే దేహం ఆలయంగా శోభిస్తుంది.

శుద్ధి కొరకు చేస్తే స్నాన మవుతుంది. బుద్ధిని జోడించి, భావనను కలిపితే, స్నానమే పరమాత్మకు అభిషేక మవుతుంది. స్నానానికి ఉపయోగించే జలం శుద్ధోదక మవుతుంది. గంగాజలం అవుతుంది.

ఈ దేహంలో పరమాత్మ వైభవంగా శోభిస్తూ ఉన్నాడు. "పరమాత్మను అభిషేకిస్తున్నాను" అనే భావంలో బ్రతుకు భవ్యంగా ప్రకాశిస్తుంది. భవంలో విభవం తొంగి చూస్తుంది. వైభవం పొంగివస్తుంది.

కాలం నాకు అనుకూలం కాకపోవచ్చు. భగవంతునికి ప్రతికూలం కాగలదా? కాలరూపంలో ఉన్నది కూడా తానే. ఇది అర్థమైన క్షణాన ఏ కాలమైనా అనుకూలమే. ప్రస్తుతం ఈ కాలంలో నా మనస్సులో రాముడున్నాడు. ఈ కాలం నాకు రాహు కాలం కాదు; రామ కాలం. రామానుకూల కాలం. రాహువు రాణించని, కేతువు కనిపించని కమనీయ కాలం. పుణ్యకాలం. పవిత్రమైన కాలం. పరమాత్మ కాలం. యమగండం తెలియని కాలం. సుడిగుండం అర్థం గాని కాలం. దైవం అండగా దండిగా, నిండుగా నిలిచిన పండు వెన్నెలల కాలం. పండే నవ్వుల కాలం.

పువ్వు అందంగా అగుపిస్తుంది. భావనతో దానిని పరమాత్మకు నివేదిస్తే అది ఆరాధనగా మారుతుంది. **"వేద్యం"** తెలిసివస్తే, ఏది ఇచ్చినా **"నైవేద్యం"** అవుతుంది. ఫలపుష్పాలే కావు; పత్ర తోయాదులు కూడా నైవేద్యాలు. అవి కూడా చేతికి అందకపోతే, ఉన్న చేతుల్ని ఏకం చేసి **"నమః"** అనటమే. అది కూడా సమర్పణమే.

చేతులు కూడా లేనివారు చాలా మంది ఉన్నారు ఈ ప్రపంచంలో. అప్పుడేం చేయాలి? చిత్తాన్నే చేతులుగా మలచుకొని, "ప్రభూ! చేతులకు నోచుకోని అదృష్ట హీనుణ్ణి. నా మనసుతోనే అర్పిస్తాను. గ్రహించు!" అని పలికితే, ఈ మాటను పరమాత్మ వినలేడా? నీ మనస్సిచ్చే పువ్వును గ్రహించేందుకు పరమాత్మ మనస్సు లేని వాడా? **శ్రోత్రస్య శ్రోత్రం మనసో మనః.** తాను నీ చెవిలో చెవిగా, నీ మనస్సులో మనస్సుగా ఉన్నాడు. భావించు. సంభావించు. భక్తిభావనా పటిమతో బ్రతుకును భగవన్మయం చేసుకుందాం.

ప్రేమతో

ఓం స్వామి సుందర చైతన్యానంద

